విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ


PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 343 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూన్ 2025 | వెల : రూ 10/-



## సెప్టెంబర్ 30లోగా

# స్థానిక ఎన్నికలు

### కీలక తీర్పు వెల్లడించిన హైకోర్టు

- స్థానిక సంస్థల ఎన్నికలపై తొలగిన అనిశ్చితి
- మూడు నెలల్లో ఎన్నికల నిర్వహణ పూర్తి చేయండి
- రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ హైకోర్టు ఆదేశం

హైదరాబాద్ --ప్రజా స్వేచ్ఛ

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న అనిశ్చితి తొలగింది. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. సెప్టెంబర్ 30లోగా తప్పనిసరిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. గత కొంత కాలంగా గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ స్థానాలకు ఎన్నికలు -మిగతా 3 లో






## ఇరాన్ న్యూక్లియర్ వ్యవస్థను దెబ్బతీసాం

- కావాలనే కొందరు దీనిని తక్కువ చేసే యత్నం
- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్ -ప్రజా స్వేచ్ఛ

ఇరాన్‌పై జరిగిన అమెరికా వైమానిక దాడులు ఆ దేశ న్యూక్లియర్ సౌకర్యాలను పూర్తిగా ధ్వంసం చేశాయని డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నారు. కానీ పలు మీడియా నివేదికల నేపథ్యంలో ఇరాన్.. న్యూక్లియర్ కార్యక్రమాన్ని కొన్ని నెలలు మాత్రమే వాయిదా వేశాయని -మిగతా 3 లో



### నేటి నుంచి నగరంలో

## బోనాల సందడి

- తొలిబోనం గోల్కొండతో ప్రారంభం
- నెలరోజుల పాటు బోనాల జాతర

హైదరాబాద్,-ప్రజా స్వేచ్ఛ


నేటి నుంచి ఆషాడం ప్రవేశంతో జంటనగరాల్లో బోనాల సందడి మొదలు కానుంది. ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బోనాల ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాలను అధికారిక పండుగగా ప్రకటించినది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని అలయాల్లో ఉన్న అమ్మవార్లకు భక్తులు బోనం సమర్పించి -మిగతా 3 లో

### తెలంగాణలో విద్యావ్యవస్థ

## మరింత పటిష్టం

### అదనపు కలెక్టర్లు పాఠశాలలను సందర్శించాలి

- కొత్తగా చేరుతున్న పిల్లలకు అనుగుణంగా సౌకర్యాల కల్పన
- విద్యార్థులకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలి
- అధికారులకు సూచించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,-ప్రజా స్వేచ్ఛ

తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నదని అన్నారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. కమాండ్ కంట్రోల్ కార్యాల్యంలో విద్యాశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి 48 వేల మంది -మిగతా 3 లో


## బనకచర్లను చట్టపరంగా అడ్డుకుంటాం



- అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్

హైదరాబాద్ --ప్రజా స్వేచ్ఛ

చట్టపరంగా బనకచర్లను అడ్డుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ నెల 30వ తేదీన ప్రజాభవన్‌లో బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు ఎన్డీఎస్ఏ కన్‌స్టలెంట్‌గా -మిగతా 3 లో



### అంతరిక్షంలోకి అడుగుపెట్టిన

## శుభాంశు శుక్లా

- కెనడీ స్పేస్ సెంటర్ నుంచి అంతరిక్ష ప్రయోగం సక్సెస్
- స్పేస్ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక ద్వారా మరో ముగ్గురితో కలసి ప్రయాణం

న్యూఢిల్లీ,

భారత వైమానిక దళ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా, ఆక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి విజయవంతంగా దూసుకెళ్లారు. దీంతో అతను మరో చరిత్ర సృష్టించారు. శుభాన్షు కక్ష్యకు చేరుకున్న రెండవ భారతీయుడు , అంతర్జాతీయ -మిగతా 3 లో

### కేసీఆర్ దమ్మేంటో

## కాంగ్రెస్ పార్టీకి తెలుసు

-మిగతా 3 లో

- రేవంత్ రెడ్డికి అబద్దాలు ఆడడం అలవాటైంది
- మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీ ఏమైంది..?
- 18 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ

: కేసీఆర్ దమ్మెంతా అన్నది ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీకి తెలుసు కాబట్టే తెలంగాణ వచ్చింది అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. తెలంగాణ వచ్చింది కాబట్టే ఇవాళ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అది మరిచిపోయి రేవంత్ రెడ్డి మాట్లాడడం బాధాకరం -మిగతా 3 లో




### బనకచర్ల గురించి మాట్లాడే అర్హత


## కాంగ్రెస్‌కు లేదు

- బహిరంగ చర్చకు ఎక్కడికి రావాలో చెప్పండి
- లోకల్ బాడీ ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదు
- మళ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచేది కేసీఆర్ ప్రభుత్వమే
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్

సిద్దిపేట -ప్రజా స్వేచ్ఛ

బనకచర్ల ప్రాజెక్ట్ గురించి కాంగ్రెస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి 18 నెలల పాలన చూశాక కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో ప్రజలకు అర్థమైందని చెప్పారు. -మిగతా 3 లో





### రహస్యంగా..ఖండాంతర బాలిస్టిక్

## క్షిపణులను అభివృద్ధి చేస్తున్న పాక్

- ఈ క్షిపణులు 5,500 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలవని సమాచారం

పాకిస్థాన్--ప్రజా స్వేచ్ఛ

పాకిస్థాన్ అత్యంత రహస్యంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్షిపణులు 5,500 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ఛేదించగలవని సమాచారం. ఈ మేరకు అమెరికా నిఘా -మిగతా 3 లో

# ఆ పని జోలికెళ్తే మళ్లీ దాడులు చేస్తాం..

## ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్



**న్యూఢిల్లీ,-ప్రజా స్వేచ్ఛ**

ఇరాన్ ఇక అణ్వాయుధ కార్యక్రమం జోలికి వెళ్లొద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. యురేనియంను శుద్ధి చేయడానికి ఆ దేశం దూరంగా ఉండాలని సూచించారు. ఇరాన్ మద్దతున్న సాయుధ ముఠాల ఆర్థిక మూలాలపై ఇజ్రాయెల్ దాడుల తీవ్రత పెంచిన సమయంలో అమెరికా అధ్యక్షుడి నుంచి ఈ హెచ్చరికలు రావడం గమనార్హం.'ఇజ్రాయెల్ వాయుసేన దక్షిణ లెబనాన్‌లోని అల్ సాదిక్ కరెన్సీ ఎక్స్ఛేంజి అధిపతి అబ్దుల్లా బక్రిని హతమార్చింది. ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ నుంచి వచ్చే డబ్బును ఈ సంస్థ హెజ్‌బొల్లాకు మళ్లిస్తున్నది. మరోవైపు యుద్ధం ఆగాలని ఇజ్రాయెల్, ఇరాన్ సమానంగా కోరుకున్నాయి. ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలు, అణు సామర్థ్యాలను ధ్వంసం చేయడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఆ తర్వాతే తాను యుద్ధాన్ని ఆపాను.' అని ట్రంప్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో కాల్పుల విరమణకు సాయం చేస్తానని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆఫర్ చేసినట్లు అమెరికా అధినేత ట్రంప్ వెల్లడించారు. అయితే తాను ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్లు చెప్పారు. ఆయన నెదర్లాండ్‌లో ప్రారంభం కానున్న నాటో సదస్సుకు వెళుతున్న సందర్భంగా 'ఎయిర్‌ఫోర్స్ వన్' లో జర్నలిస్టులకు ఈ విషయాలు వెల్లడించారు.

# వచ్చే ఏడాది నుంచి రెండుసార్లు సీబీఎస్ఈ పది పరీక్షలు



**న్యూఢిల్లీ,-ప్రజా స్వేచ్ఛ**

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది నుంచి రెండుసార్లు పది పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఏడాదిలో రెండుసార్లు పదో తరగతి పరీక్షల నిర్వహణకు బోర్డు ఆమోదం తెలిపింది. బోర్డు నిర్ణయంతో సీబీఎస్ఈ విధానంలో 10వ తరగతి చదివే విద్యార్థులు వచ్చే ఏడాది అంటే 2026 నుంచి బోర్డు పరీక్షలను ఏడాదిలో రెండుసార్లు రాయాల్సి ఉంటుంది. ఇందులో తొలి దఫా పరీక్షలు ఫిబ్రవరిలో రెండో విడత పరీక్షలు మేలో జరుగుతాయి. తొలి విడత పదో తరగతి పరీక్షలను బోర్డు తప్పనిసరి చేసింది. రెండో విడత పదో తరగతి పరీక్షలను ఆప్షనల్‌గా పెట్టింది. రెండు విడతల్లో మంచి స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది. రెండు దశలకు సంబంధించిన ఫలితాలు వరుసగా ఏప్రిల్, జూన్‌లో ప్రకటించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# పసిఫిక్ మహాసముద్రం పాలైన 3 వేల వాహనాలు



**న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ**

మెక్సికోకు వేలాది వాహనాలను రవాణా చేస్తున్న ఓ భారీ కార్గో నౌక అగ్నిప్రమాదానికి గురైన కొన్ని వారాల అనంతరం ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో మునిగిపోయింది. ఈ నౌకలో సుమారు 800 ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు మొత్తం 3,000 కొత్త వాహనాలు ఉన్నట్లు సమాచారం. లండన్‌కు చెందిన జోడియాక్ మారిటైమ్ అనే సంస్థ 'మార్నింగ్ మిడాస్' అనే ఈ నౌక నిర్వహణ వ్యవహారాలు చూస్తోంది. అలస్కాలోని అలూషియన్ దీవుల సమీపంలో అంతర్జాతీయ జలాల్లో ఈ దుర్ఘటన చోటుచేసుకుందని సంస్థ వెల్లడించింది. అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) కథనం ప్రకారం.. మంటల వల్ల జరిగిన నష్టం, ప్రతికూల వాతావరణం, నౌకలోకి నీరు చేరడం వంటి కారణాలతో తీరానికి 415 మైళ్ల దూరంలో, సుమారు 16,404 అడుగుల లోతున నౌక మునిగిపోయింది. ఈ ఘటన అనంతరం ఆ ప్రాంతంలో ఇప్పటివరకు ఎలాంటి కాలుష్య ఆనవాళ్లు కనిపించలేదని యూఎస్ కోస్ట్ గార్డ్ ప్రతినిధి, ఆఫీసర్ కామెరాన్ స్నెల్ తెలిపారు.

# అభినందన్ వర్ధమాన్‌ను బంధించిన పాక్ అధికారి ఉగ్రవాద కాల్పుల్లో మృతి

**న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ**

2019 బాలాకోట్ దాడుల సమయంలో అప్పటి భారత వయుసేన వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ ను అదుపులోకి తీసుకున్న పాక్ అధికారి మేజర్ మోయిజ్ అబ్బాస్ షా తాజాగా మరణించారు. పాక్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయాడు. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలో బుధవారం తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులతో జరిగిన తీవ్రస్థాయి ఘర్షణలో మేజర్ అబ్బాస్ షా మరణించారు.పాకిస్థాన్ సైన్యంలోని ఎలైట్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ (ఎస్ఎస్‌జీ)లో అబ్బాస్ షా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా ఆయన బృందం కూంబింగ్ నిర్వహిస్తుండగా టీటీపీ ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడినట్లు పాక్ సైన్యం ప్రకటించింది. పాకిస్థాన్‌లోని దక్షిణ వజీరిస్థాన్ జిల్లాలో నిఘా ఆధారిత ఆపరేషన్ (ఐబిఓ)లో భద్రతా దళాలు 11 మంది ఉగ్రవాదులను హతమార్చగా, ఇద్దరు భద్రతా సిబ్బంది అమరులయ్యారని పాక్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. 2019 ఫిబ్రవరిలో జమ్ముకశ్మీర్‌లోని పుల్వామాలో సీఆర్పీఎఫ్ జవాన్ల కాన్వాయ్‌పై ఉగ్రవాదులు బాంబు దాడి చేశారు. ఈ ఘటనలో పదుల సంఖ్యలో జవాన్లు అమరులుకాగా, పలువురు గాయపడ్డారు. దీనికి ప్రతీకారంగా ఫిబ్రవరి 27న భారత వాయుసేన మెరుపు దాడులు చేసింది. బాలకోట్ లోని జైషే మహ్మద్ ఉగ్రవాద శిక్షణ శిబిరాలను బాంబులతో పేల్చివేసింది. ఈ ఘటనలో



వందల సంఖ్యలో ఉగ్రవాదులు మరణించారు. భారత వాయుసేన సర్జికల్ స్ట్రైక్స్‌ను అడ్డుకునేందుకు అత్యాధుక ఎఫ్-16 ఫైటర్ జెట్స్‌ను పాకిస్థాన్ రంగంలోకి దించింది. మిగ్-21 యుద్ధ విమానాన్ని నడుపుతున్న వింగ్ కమాండర్ అభినందన్, పాక్‌కు చెందిన ఒక ఎఫ్-16ను కూల్చివేశారు. ఈ సందర్భంగా కూలిపోతున్న మిగ్-21 నుంచి సురక్షితంగా బయటపడ్డారు. అయితే పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో దిగిన ఆయనను పాక్ ఆర్మీ నిర్బంధించింది. ఈ ఘటన అనంతరం అభినందన్‌ను భారత ప్రభుత్వం 'శౌర్యచక్ర'తో సత్కరించిన విషయం తెలిసిందే. అంతేకాదు, వాయుసేనలో వింగ్ కమాండర్‌గా పనిచేస్తున్న అభినందన్‌ను గ్రూప్ కెప్టెన్‌గా ప్రమోట్ చేశారు. ఇది సైనిక దళంలో కర్నల్ ర్యాంక్‌కు సమానం.

# శశిథరూర్ పై మల్లిఖార్జున ఖర్గే ఫైర్



**న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ**

ప్రధాని మోడీని కాంగ్రెస్ నేత శశిథరూర్ ప్రశంసించడంపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే బుధవారం మండిపడ్డారు. "మాకు దేశం ముందు , కానీ కొంతమందికి ముందు మోడీ" అని ఎద్దేవా చేశారు. శశిథరూర్ ఇంగ్లీషులో నిష్ణాతులని అన్నారు. "నేను ఇంగ్లీష్ బాగా చదవలేను. ఆయన భాష బాగుంటుంది. అందుకే తాము ఆయనను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిని చేశాం " అని అన్నారు. 26మంది పర్యాటకులను బలిగొన్న పహల్గాం దాడి తర్వాత మొత్తం ప్రతిపక్షం సైన్యానికి మద్దతు ప్రకటించిందని అన్నారు. దేశం ముందు, పార్టీ తర్వాత అని తాము చెప్పామని, కానీ కొంతమంది ముందు మోడీ తర్వాత దేశం అని భావిస్తారు. మనం ఏమి చెయ్యగలమని అన్నారు. ఇప్పటివరకు, కాంగ్రెస్ అధిష్టానం నుండి శశిథరూర్‌కు ఎదురైన అతిపెద్ద అవమానం ఇదే కానుంది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆయన వ్యాఖ్యలపై పార్టీ సహచరులు తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే.

# అస్సాంలో సిఆర్‌పిఎఫ్ శిబిరంపై గ్రెనేడ్ దాడి..

## ముగ్గురికి గాయాలు



**గువహటి ప్రజా స్వేచ్ఛ**

అస్సాంలో సిఆర్‌పిఎఫ్ శిబిరంపై జరిగిన గ్రెనేడ్ దాడిలో ముగ్గురు పోలీసులు గాయపడినట్లు అధికారులు బుధవారం ప్రకటించారు. గోలాఘాట్ జిల్లాలోని బోకాఖాట్ సమీపంలో సిఆర్‌పిఎఫ్ శిబిరంపై మంగళవారం రాత్రి మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు గ్రెనేడ్‌తో దాడి చేశారు. గాయపడిన వారిని బోకాఖాట్‌లోని ఆస్పత్రిలో చేర్చినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారని, విచారణ చేపట్టారని అన్నారు. మోటార్ సైకిల్‌పై వచ్చిన నిందితుల కోసం గాలిస్తున్నామని, ఉగ్రవాద చర్య లేదా దుండగుల చర్య తో పాటు పలు కోణాల్లో విచారణ చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యవసాయమంత్రి అతుల్‌బోరా ఈ ఘటనను ఖండించారు. 'పిరికిపంద హింసాత్మక చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. నాగరిక సమాజంలో ఇటువంటి ఘటనలకు చోటు లేదు' అని పేర్కొన్నారు. ఆయన బోకాఖాట్ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

# కాల్పుల్లో ఓ ఉగ్రవాది హతం..!


## భారత్‌లోకి చొరబడేందుకు యత్నం..



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదిని భారత సైన్యం హతమార్చింది. మంగళవారం రాజౌరీ కేరీ సెక్టార్‌లోని బరాత్ గాలా ప్రాంతంలో ముగ్గురు నుంచి నలుగురు ఉగ్రవాదులు చొరబాటుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన సైనికులు కాల్పులు ప్రారంభించారు. ఆ తర్వాత సంఘటనా స్థలాన్ని పరిశీలించగా.. నియంత్రణరేఖ సమీపంలో ఓ ఉగ్రవాది మృతదేహం పడి ఉన్నది. మిగతా ఉగ్రవాదులు అక్కడి నుంచి పారిపోయినట్లుగా భద్రతా బలగాలు తెలిపాయి. సమాచారం ప్రకారం.. ఉదయం 8-9గంటల మధ్య భారత సైన్యం బరాత్ గాలా ప్రాంతంలోని రేఖ వెంబడి అనుమానాస్పద కదలికలను గమనించారు.చొరబాటు ప్రయత్నాలను గుర్తించిన వెంటనే.. అప్రమత్తమైన సైనికులు కాల్పులు ప్రారంభించారు. ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నం విఫలం చేసిన అనంతరం సైన్యం ఆ ప్రాంతంలో భారీ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించింది. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తి కనిపిస్తే వెంటనే సైన్యానికి తెలియజేయాలని స్థానిక ప్రజలకు సైన్యం విజ్ఞప్తి చేసింది. ఇదిలా ఉండగా.. జూన్ 15 అర్ధరాత్రి కూడా చొరబాటు ప్రయత్నం జరిగింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ ప్రాంతంలో ఇది రెండవ చొరబాటు ప్రయత్నం. జూన్ 15 అర్ధరాత్రి పాకిస్తాన్ నుండి ఉగ్రవాదుల అదే ప్రాంతంలో చొరబడటానికి ప్రయత్నించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ సమయంలో అప్రమత్తమైన సైనికులు కూడా ఆ ప్రయత్నాన్ని విఫలం చేశారు.

# బీహార్‌కు ఎస్ఎంఆర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్



**న్యూఢిల్లీ- ప్రజా స్వేచ్ఛ**

న్యూక్లియర్ ఎనర్జీ మిషన్‌లో భాగంగా బీహార్‌కు తొలి అటామిక్ ప్లాంట్ మంజూరీ అయ్యింది. అణు ప్లాంట్ మంజూరీ అయిన ఆరు రాష్ట్రాల్లో బీహార్ ఒకటి. కేంద్రం ఆమోదం తర్వాత స్మాల్ మోడ్యులార్ రియాక్టర్(ఎస్ఎంఆర్) పవర్ ప్లాంట్‌ను ప్రకటించినట్లు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టార్ తెలిపారు. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ ప్లాంట్‌పై ప్రకటన చేసినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఒకవేళ బీహార్ ప్రభుత్వం న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌ను సెటప్ చేస్తే, దానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ఖట్టార్ తెలిపారు.ప్లాంట్ సైట్ ఏర్పాటు, ఏ స్థాయిలో ఆ ప్లాంట్ ఉండాలన్న దానిపై తుది రిపోర్టును త్వరలో వెల్లడించనున్నారు. న్యూక్లియర్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు కోసం కేంద్ర బడ్జెట్‌లో ఈసారి న్యూక్లియర్ ఎనర్జీ మిషన్‌కు 20 వేల కోట్లు కేటాయించారు. ఎనర్జీ సెక్యూర్టీని కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి రాష్ట్రంలో అణు విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. కొత్త జనరేషన్ న్యూక్లియర్ టెక్నాలజీతో ఎస్ఎంఆర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. చాలా తక్కువ ఖర్చుతో అనువైన రీతిలో ఆ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారని నిపుణులు చెప్పారు. చిన్న గ్రిడ్స్‌లో వీటిని అమర్చుతారని, అడ్వాన్స్‌డ్ డిజైన్ వల్ల ఇవి సురక్షితమైనవిగా భావిస్తున్నారు.

# సెప్టెంబర్ 30లోగా స్థానిక ఎన్నికలు

(మొదటి తరువాయి)

జరగకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్త పరుస్తున్నారు. ఈ అంశంపై ఆరుగురు మాజీ సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. వారు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అనంతరం హైకోర్టు ఈ తీర్పును వెల్లడించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ తరఫున న్యాయవాదులు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం మరో 30 రోజుల గడువు అవసరం అని తెలపడంతో హైకోర్టు ఆ అభ్యర్థనని పరిగణనలోకి తీసుకుంది. దీనితో రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత, ఎన్నికల నిర్వహణకు మరో 60 రోజులు కావాలన్న రాష్ట్ర ఎన్నికల సంఘం అభ్యర్థనకు కూడా కోర్టు అంగీకారం తెలిపింది. దీనివల్ల కలిపి గరిష్ఠంగా 90 రోజుల లోపుల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనితో, 2025 సెప్టెంబర్ 30వ తేదీ లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై పడనుంది. స్థానిక పాలన లోపిస్తున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, ప్రజాప్రతినిధులు లేని పాలన వల్ల గ్రామీణాభివృద్ధి ఇబ్బందిగా మారుతుందని పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలలో నూతన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడం, పథకాల అమలు జాప్యం కావడం వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారు కోర్టుకు విన్నపించుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. గ్రామపంచాయతీ ఎన్నికలు 3 నెలల్లో నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు వెలువరించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు 2024 జనవరి 30వ తేదీతో ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ టి.మాధవిదేవి తీర్పు ఇచ్చారు. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరు స్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి' అని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక.. ప్రక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ.. రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

## ఇరాన్ న్యూక్లియర్ వ్యవస్థను దెబ్బతీసాం

(మొదటి తరువాయి)

చెబుతున్నాయి. ఈ నివేదికలను ట్రంప్ నకిలీ వార్తలని తోసిపుచ్చారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్ లాట్‌ఫామ్‌లో ఒక పోస్ట్‌లో ఇలా పేర్కొన్నారు. ఈ వార్తలు ప్రచురించే సీఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్‌లు కలిసి ఈ చారిత్రక విజయవంతమైన సైనిక దాడిని చిన్నబుచ్చే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇరాన్‌లోని న్యూక్లియర్ సౌకర్యాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ మీడియా సంస్థలు ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాయని ట్రంప్ తెలిపారు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా ఈ నివేదికలను పూర్తిగా తప్పు అని తిరస్కరించారు. ఈ నివేదికలు ట్రంప్‌ను అవమానించేందుకు చేసిన ప్రయత్నమని ఆమె అన్నారు. 14 లక్షల కిలోల బాంబులను ఖచ్చితంగా లక్ష్యంపై వేస్తే ఏమవుతుందో అందరికీ తెలుసని అన్నారు. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఆఎం) నివేదిక ప్రకారం, జూన్ 22న అమెరికా ఇరాన్‌లోని మూడు న్యూక్లియర్ కేంద్రాలైన ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌లపై దాడులు జరిపింది. అయితే ఈ దాడుల్లో ఇరాన్ న్యూక్లియర్ ప్రధాన భాగాలను ధ్వంసం కాలేదని , కేవలం కొన్ని నెలల తర్వాత వాయిదా వేశారని ఈ నివేదిక చెబుతోంది. ఈ సౌకర్యాలకు నష్టం జరిగినప్పటికీ, ఇరాన్ న్యూక్లియర్ మౌలిక సౌకర్యాలు చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ షయంపై సమాచారం ఇచ్చిన ఇద్దరు వ్యక్తులు, గుర్తింపు వెల్లడించకుండా, ఈ దాడులు ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ సౌకర్యాలకు నష్టం కలిగించినప్పటికీ, వాటిని పూర్తిగా ధ్వంసం చేయలేకపోయాయని చెప్పారు. ఇరాన్‌లోని అత్యంత సుసంపన్నమైన యురేనియం కొన్ని స్థలాల నుంచి దాడులకు ముందే తరలించబడి సురక్షితంగా ఉందని, సెంట్రిఫ్యూజ్‌లు కూడా చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని వారు తెలిపారు. ఫోర్డోలోని లోతైన భూగర్భ యురేనియం శుద్ధి కర్మాగారం వద్ద ప్రవేశ ద్వారం కూలిపోయింది. మౌలిక సౌకర్యాలకు నష్టం జరిగింది. అయితే, భూగర్భంలోని ప్రధాన నిర్మాణాలు ధ్వంసం కాలేదని ఒక వ్యక్తి తెలిపారు. గతంలో జరిగిన అంచనాలు కూడా ఈ ఫలితాన్ని హెచ్చరించాయని ఆ వ్యక్తి చెప్పారు. ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడులు పూర్తి విజయవంతమయ్యాయని చెప్పినప్పటికీ, డిఐఏ నివేదిక వారి వాదనలను ఖండిస్తోంది. ఈ దాడులు ఇరాన్ న్యూక్లియర్ కార్యక్రమాన్ని గణనీయంగా దెబ్బతీసినప్పటికీ, దానిని పూర్తిగా నాశనం చేయలేకపోయాయని నివేదిక స్పష్టం చేస్తోంది. ఇది అమెరికా, ఇజ్రాయెల్ నాయకుల వాదనలకు విరుద్ధంగా ఉంది. ఈ వివాదం ప్రస్తుతం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

## అంతరిక్షంలోకి అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

(మొదటి తరువాయి)

అంతరిక్ష కేంద్రంకి ప్రయాణించిన మొదటి భారతీయుడు అయ్యారు. ఈ ప్రయోగం బుధవారం ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుండి స్పేస్ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక ద్వారా జరిగింది. ఆక్సియం-4 మిషన్ ఒక ప్రైవేట్ అంతరిక్ష విమాన వెంచర్. శుక్లాతో పాటు మరో ముగ్గురు అంతర్జాతీయ వ్యోమగాములు అంతరిక్షంలో చేరారు. శుభాన్షు అంతరిక్షయాత్ర భారతదేశ అంతరిక్ష కార్యక్రమంలో ఓ ముఖ్యమైన ఘట్టం. 41 సంవత్సరాల తర్వాత ఒ భారతీయుడు అంతరిక్షంలోకి ప్రయాణించడం ఇదే మొదటిసారి. 1984లో భారత వైమానిక దళ అధికారి, స్క్వాడ్రాన్ లీడర్ రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి దూసుకెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. కజకిస్తాన్ నుంచి సోవియెట్ అంతరిక్ష నౌకలో సోయెజ్ -టి-11 అంతరిక్ష నౌకద్వారా అంతరిక్షంలోకి దూసుకెళ్లిన భారతీయుడు అయ్యాడు. నాలుగు దశాబ్దాల తర్వాత మరో అద్భుతం ఇది. శుభాన్షు శుక్లా కక్ష్యలోకి దూసుకెళ్లడం ద్వారా భారత అంతరిక్షచరిత్రలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు. అలాగే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం( ఐఎస్ ఎస్ ) ప్రయోగాలు చేస్తున్న మొదటి భారతీయపౌరుడిగా రికార్డులకు ఎక్కాడు, రాకేశ్ శర్మ చారిత్రాత్మక అంతరిక్షయాత్ర జరిగిన తర్వాత ఒక సంవత్సరానికి 1985లో జన్మించిన శుక్లా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కెప్టెన్, ప్రస్తుతం వ్యోమగామి. ఆక్సియమ్ స్పేస్ యాక్స్ -4 మిషన్లో భాగంగా ఎ÷-లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి స్పేస్ ఎక్స్ డ్రాగన్ అంతరిక్షనౌకను ప్రయోగించారు. బుధవారం ఫాల్కన్ -9 లోని మెర్లిన్ ఇంజన్లు నిప్పులు చిమ్ముకుంటూ స్పేస్ ఎక్స్డ్రాగన్ ను ఎర్త్ ఆర్బిట్ లోకి తీసుకెళ్లింది. నిర్దేశిరచిన ఖచ్చితత్వంతో ఫాల్కన్-9 డ్రాగన్ ను కక్ష్యలో ప్రవేశపెట్టింది. రెండోదశలో డ్రాగన్ మరింత ముందుకు దూసుకెళ్లి అంతరిక్ష ప్రయోగశాల వైపు సాగింది. ప్రయోగం ప్రారంభం కావడానికి ఓ గంటముందు శుక్లా, ఇతర వ్యోమగాములు తమతమ కుటుంబ సభ్యులకు వీడ్కోలు పలికారు. శుక్లా భార్య,పిల్లలు కూడా శుభాకాంక్షలు చెప్పారు. విఘ్నాలతో ఆలస్యమైన అంతరిక్ష ప్రయాణం కొన్ని విఘ్నాల కారణంగా మే 28నే జరగాల్సిన ఈ ప్రయోగం ఆలస్యం అయింది. సాంకేతిక లోపాలు,ఫాల్కన్ -9, డ్రాగన్ అంతరిక్ష నౌక, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వాతావరణ పరిస్థితులు, ఇలా ఎన్నో కారణాల వల్ల జాప్యం జరిగింది. నలుగురు వ్యోమగాములు దాదాపు నెల్లాళ్లపాటు నిర్బంధంలో ఉండాల్సివచ్చింది. స్పేస్ ఎక్స్, ఆక్సియమ్, నాసా, ఇస్రో నిపుణులు లోపలన్నింటినీ విజయవంతంగా చక్కదిద్దారు. ఎట్టకేలకు బుధవారంనాడు విజయవంతంగా ప్రయోగం జరిగింది. అంతరిక్ష ప్రయాణంలో విఘ్నాలు ఓ భాగం, మిషన్ ఆలస్యం అయినా యాక్స్-4 సిబ్బంది ఉత్సాహంగా అంతరిక్ష కేంద్రానికి సురక్షితమైన,విజయవంతమైన ప్రయాణంకోసం ఎదురు చూశారని మిషన్ కమాండర్ పెగ్గి విట్సన్ తెలిపారు.ఎఎక్స్ ? సిబ్బందితో డ్రాగన్ అంతరిక్ష నౌక ప్రస్తుతం భూమి నుంచి 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని కలిసేందుకు నిర్దేశిరచిన భూ కక్ష్యలో తిరుగుతోంది.మిశన్ పైలట్ అయిన శుక్లా అంతరిక్ష కేంద్రానికి సాగుతున్న ప్రయాణాన్ని పరిశీలిస్తారు. గతంలో మిగ్ -21, మిగ్ -29, డోర్నియర్, ఎఎన్- 32, సుఖోయ్ -30వంటి పలు విమానాల టెస్ట్ పైలెట్ అయిన శుక్లా డ్రాగాన్ అంతరిక్ష నౌక పైలట్ గా కీలకపాత్ర వహిస్తున్నారు. భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లాను ఆయన అంతరిక్ష సహచరులు షుక్స్ అని వ్యవహరిస్తారు.

## రహస్యంగా..ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తున్న పాక్

(మొదటి తరువాయి)

సంస్థలు సంచలన విషయాలు వెల్లడించాయి.భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత చైనా మద్దతుతో పాక్ తన అణ్వాయుధ సామగ్రిని అప్‌గ్రేడ్ చేయాలని భావించింది. అందుకు అనుగుణంగానే అత్యంత రహస్యంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణుల అభివృద్ధి చేపట్టినట్లు వాషింగ్టన్ నిఘా సంస్థలు ఓ నివేదికలో వెల్లడించాయి. అమెరికాలోని పలు లక్ష్యాలను కూడా ఈ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు తాకగలవని తెలిపాయి. ఈ తరహా ఖండాంతర క్షిపణులను అభివృద్ధి చేయడం లేదా సమకూర్చుకోవాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తే, ఆ దేశాన్ని అణ్వాయుధ ప్రత్యర్థిగా గుర్తిస్తామని అమెరికా అధికారులు స్పష్టం చేసినట్లు సదరు నివేదిక పేర్కొంది. పాకిస్థాన్ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను తయారు చేయడం గానీ, కొనుగోలు చేయడం గానీ చేస్తే.. ఆ దేశాన్ని వాషింగ్టన్ అణ్వస్త్ర ప్రత్యర్థిగా పరిగణించడం తప్ప వేరే మార్గం లేదు. అలాంటి క్షిపణులను కలిగి ఉన్న ఏ ఇతర దేశాన్నీ మిత్రదేశంగా పరిగణించదు' అని అమెరికా అధికారులను ఊటంకిస్తూ సదరు నివేదిక పేర్కొంది. కాగా, తమ దేశానికి ముప్పు కలిగించే అవకాశం ఉన్న లేదా అణ్వాయుధాలు కలిగిన ఏ దేశాన్నైనా అమెరికా తన ప్రత్యర్థిగా పరిగణిస్తుంది. ఇప్పటికే రష్యా, చైనా, ఉత్తర కొరియాలను అమెరికా తమ శత్రు దేశాలుగా పరిగణిస్తోన్న విషయం తెలిసిందే.

## బనకచర్ల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు

(మొదటి తరువాయి)

మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలి, కావాలని ప్రజలు అంటున్నారని తెలిపారు. మళ్లీ పదేళ్ల దాకా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా రేవంత్‌రెడ్డి చేశారని అన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదని హరీష్‌రావు ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే నిర్వహించడం లేదని ఆరోపించారు. బుధవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల ప్రశాంత్ పాటిల్ బీఆర్ఎస్‌లో చేరారు. ప్రశాంత్ పాటిల్‌కి హరీష్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హరీష్‌రావు వెంట ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అబద్దాల్లో సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు పోదామని అంటున్నారని.. ఎక్కడికి రమ్మంటారో చెప్పాలని.. తాను సిద్ధమని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రతి సవాల్ విసిరారు. ఏ టీవీలో కూర్చుందామో, ఎక్కడ మాట్లాడుదామో చెప్పు తాను రెడీ... రేవంత్‌రెడ్డి వస్తారో, మహేష్ కుమార్ గౌడ్ వస్తారో చెప్పాలని ప్రతి సవాల్ చేశారు. అసెంబ్లీ నిర్వహించడం చేతగాక రేవంత్‌రెడ్డి పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. వారం రోజులకు మించి అసెంబ్లీ నడిపే పరిస్థితి లేదని చెప్పుకొచ్చారు. మళ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచేది కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు పూర్తిగా అధికారంలో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో విద్యావ్యవస్థ మరింత పటిష్టం

(మొదటి తరువాయి)

విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని సీఎంకు అధికారులు వివరించారు. పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించాలని, గ్యాస్.. కట్టెల పొయ్యిల బాధ లేకుండా మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు సోలార్ కిచెన్లు ఏర్పాటుపై

వెంటనే దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణలవుతున్న విద్యార్థులకు, ఇంటర్‌లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య తేడా ఎందుకు ఎక్కువగా ఉందని అధికారుల్ని ప్రశ్నించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్‌లో చేరేలా చూడాలన్నారు. ఇంటర్ తర్వాత జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ పొందొచ్చని, తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్మీడియట్‌లో నమోదు అవుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉండడంపై సీఎం అధికారులను ప్రశ్నించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి నగరంలో బోనాల సందడి

(మొదటి తరువాయి)

మొక్కులు చెల్లించుకోనున్నారు. నెల రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లను చేసింది. గోల్కొంట కోటలో బోనాలు మొదట ప్రారంభించే సంప్రదాయం వస్తుంది. దీంతో గోల్కొండ బోనాలతో సందడి మొదలు కానుంది. గురువారం మొదలు కానున్న ఈ సందడిలో భాగంగా ఆదివారం గోల్కొండ బోనాలు జరగనున్నాయి. బోనాలు సంప్రదాయం ప్రకారం ప్రసిద్ధి చెందిన గోల్కొండ కోటలోని శ్రీఎల్లమ్మ (జగదాంబిక) ఆలయంలో ప్రారంభం కావడం ఆనవాయితీ. ప్రతీ సంవత్సరం ఆషాడమాసంలో ఆమావాస్య తర్వాత వచ్చే గురువారం, లేదా ఆదివారం బోనాలు ప్రారంభవవుతాయి. అయితే, ఈ నెల బుధవారం అమవాస్య కావడంతో ఆ తర్వాత రోజు గురువారం బోనాల జాతర మొదలుకానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తుంది. బోనాలు ఉత్సవాలకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని శ్రీజగదాంభిక ట్రస్టు బోర్డు ఏర్పాట్లు మొదలుపెట్టింది. ఇప్పటికే మంత్రి పొన్న ప్రభాకర్ సమీక్ష చేశారు. గురువారం నుంచి జూలై 24వతేదీ వరకు తెలంగాణలో బోనాల జాతర జరుగనుంది. నెలరోజుల పాటు ఇక్కడ తొమ్మిది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజలకు నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. వీరికోసం గోల్కొండ కోటలోని అక్కన్న మాదన్న కార్యాలయాలు, బాడీగార్డ్స్ లైన్స్ ప్రాంతాలు సిద్ధం చేస్తున్నారు. పూజల ప్రారంభోత్సవంలో భాగంగా మొదటి రోజు లంగర్‌హౌజ్ చౌరస్తా నుంచి అమ్మవారి తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తారు.

## కేసీఆర్ దమ్మేంటో కాంగ్రెస్ పార్టీకి తెలుసు

(మొదటి తరువాయి)

అని కవిత అన్నారు. మహిళలకు రూ. 2500, పెన్షన్ల మొత్తం పెంపుపై ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలు, మహిళలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంపై అసెంబ్లీలోనే చర్చిద్దామన్నారు. రేవంత్ రెడ్డి చంద్రబాబును పిలిచి హైదరాబాద్ బిర్యాని పెట్టి గోదావరి నీళ్లను గిఫ్ట్‌గా ఇచ్చారు. 2016లో పోలవరం, బనకచర్ల అంశమే లేదు. రేవంత్ రెడ్డికి అబద్దాలు ఆడడం అలవాటైంది. గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించడం సరికాదు. యస్.. అసెంబ్లీ పెడుదాం ఆరు గ్యారెంటీల అమలు, మహిళలను మోసం చేసినదానిపై చర్చిద్దామన్నారు కవిత. రేవంత్ రెడ్డి హుందాగా వ్యవహరించాలి. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయరు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరు అని కవిత పేర్కొన్నారు. ఇక ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు రాశారు. అబిడ్స్ జీపీవోలో ఎమ్మెల్సీ కవిత, జాగృతి కార్యకర్తలు పోస్ట్ కార్డులను పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. వృద్ధులకు రూ. 2 వేల పెన్షన్‌ను, రూ. 4 వేలు చేస్తామన్న హామీని కాంగ్రెస్ విస్మరించింది. వికలాంగుల పెన్షన్‌ను రూ. 4 వేల నుంచి రూ. 6 వేలకు పెంచకుండా కాంగ్రెస్ మోసం చేసింది. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీ ఏమైంది..? గ్యారెంటీలపై సోనియా గాంధీ సంకతం పెట్టిన గ్యారెంటీ కార్డులను ఇంటింటికి పంచారు. సోనియాగాంధీ ముఖం చూసి ఓట్లేసిన మహిళలను, వృద్ధులను, వికలాంగులు మోసం చేశారు. అందుకే సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు పంపించాము. పెన్షన్ల మొత్తాన్ని పెంచాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలివ్వాలని సోనియా గాంధీని కోరామని కవిత పేర్కొన్నారు.

## బనకచర్లను చట్టపరంగా అడ్డుకుంటాం

(మొదటి తరువాయి)

వ్యహరిస్తోందని చెప్పారు. సత్వరమే నాగార్జునసాగర్‌లో పూడిక తీతకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. జలసౌధలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బనకచర్లతో సహా పలు కీలక అంశాలపై మంత్రి ఉత్తమ్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్ఎల్‌బీసీ పనులను పునరుద్ధరిస్తామని చెప్పారు. రాష్ట్ర నీటిపారుదల శాఖకు ఇద్దరు సైనికాధికారులని కేటాయించామని తెలిపారు. టన్నెల్ నిర్మాణంలో నిష్ణాతులైన వారి నియామకానికి కసరత్తు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన టన్నెల్ నిపుణులు కల్నల్ పరిక్షిత్ మెహరా జులైలో చేరారని తెలిపారు. నీటిపారుదల శాఖ సలహా దారుడిగా జనరల్ హర్పల్ సింగ్‌కు ఆహ్వానం పలుకుతున్నామని చెప్పారు. భారత సైన్యంలో ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా జనరల్ హర్పల్ సింగ్ పనిచేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# సంపాదకీయం

## అప్రకటిత ఎమర్జెన్సీలో మన ప్రజాస్వామ్యం!


ఎమర్జెన్సీ చీకటి రోజులు పోయాయి. 50 ఏళ్ల క్రితం నాటి ఘటనలు తలచుకుంటూ నాటి ప్రధాని ఇందిరను దునుమాడుతున్నారు. అప్పటికీ ఇప్పటికీ పెద్దగా తేడా కనిపించడం లేదు. ఎమర్జీన్సీలో లేము అన్నదే కనిపిస్తుంది తప్ప..ప్రజలు అప్రకటిత ఎమర్జెన్సీలో కాలం గడుపుతున్నారు. ప్రస్తుత పాలకుల్లో ఇది బాగా కనిపిస్తోంది. పార్లమెంటులో సమస్యలపై చర్చ ఉండదు. వారు తీసుకున్న నిర్ణయాలే అమలవుతాయి. ఇష్టానుసారం ఎన్‌కౌంటర్లతో నక్సల్స్‌ను తుదముట్టించే నిరంకుశ విధానం నడుస్తోంది. అర్బన్ నక్సల్స్ పేరుతో మేధావులు గళమెత్తకుండా చేస్తున్నారు. విమర్శలను తట్టుకునే స్థితిలో నేటి పాలకులు లేరు. విపక్షాలు కూడా అధికారమే పరమావధిగా ఎత్తులు వేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇదో గేమ్. ధరలు తగ్గించాలని అడగవద్దు, ఉద్యోగాలు కావాలని రోడ్డెక్కవద్దు. చదువులు కావాలని కోరుకోవద్దు. మంచి ఆరోగ్యం కావాలని డిమాండ్ చేయవద్దు. జిఎస్టీ వాతలు తగ్గించాలని ఎలుగెత్తకూడదు. వారి దయా దాక్షిణ్యాల మేరకు బతకాల్సిన దుస్థితిలో భారత ప్రజాస్వామ్యం నడుస్తుందని గుర్తించాలి. పాలకులు మాత్రమే మంచి జీవితం గడుపుతున్నారు. విమానాల్లో తిరుగుతున్నారు. ప్రజలు మాత్రం నేటికీ అర్థాకలి, నిరుద్యోగం తదితర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఎమర్జెన్సీని నిందిస్తూ మనం సాధించిన ప్రగతి ఏమిటో నేతలు చర్చించాలి. నేటికీ అధికార పక్షం, విపక్షం తమకు తోచిన విధంగా నిరంకుశ విధానాలే అవలంబిస్తున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు. అందుకే ప్రస్తుతం దేశంలో కొత్తగా చీకటి రోజులు తాండవిస్తున్నాయి. నేతలు తమ నిరంకుశ విధానాలతోనే నేటికీ రాజ్యమేలుతున్నారు. పేరుకే ప్రజాస్వామ్యంగా మనమంతా ఘనంగా చెప్పుకుంటున్నా.. స్వేచ్ఛగా బతికే పరిస్థితి లేదు. స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితులు లేవు. ప్రభుత్వాలను విమర్శించే అవకాశం ఉండడం లేదు. ప్రభుత్వాలను విమర్శించే వేదిక లేకుండా పోయింది. పత్రికలు బాకాలుగా మారాయి. ప్రజా ఉద్యమాలను అణచివేయడంలో ఇందిరను మించి పోయారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ వల్ల కేవల రాజకీయ నాయకులే జైలుకు వెళ్లారు. ఇది తప్పే. ఎమర్జెన్సీ చీకటి రోజులను నిందించాల్సిందే. కేవలం తన పదవిని కాపాడు కునేందుకు ఇందిర ఎమర్జెన్సీ అస్త్రాన్ని ఉపయోగించింది. అయితే ఆనాడు మనమంతా గుర్తించని మరోకోణం కూడా ఒకటి ఉంది. ఎమర్జెన్సీలో వ్యవస్థలన్నీ పక్కాగా నడిచాయి. గ్రామస్థాయిలో కూడా ఆఫీసులు సమయానికి నడిచాయి. ఉద్యోగులు సక్రమంగా పనిచేశారు. లంచం పుచ్చుకోవాలంటేనే వణికిపోయారు. కల్తీల బెడద తొలగింది. నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉన్నాయి. బ్లాక్ మార్కెటీర్ల భరతం పట్టారు. వేళకు బస్సులు, ట్రైన్‌లు నడిచాయి. ఇన్ని మంచి పనులు జరగినా ఇవన్నీ ఎప్పుడూ ప్రచారంలోకి రాలేదు. ఎందుకంటే ప్రచారకర్తలు రాజకీయ నాయకులే కనుక వీటి గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. ఈనాడు అలాంటి పరిస్థితి ఎందకు లేదో ప్రజలు చర్చించాలి. అందుకే ఆనాటి ఎమర్జెన్సీని తలదన్నేలా నేటి పాలకులు తమ విధానాలను కొనసాగిస్తున్నారు. యాభై సంవత్సరాల క్రితం 1975లో అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ 21 నెలల పాటు దేశంలో అత్యయికస్థితిని విధించారు. తనను వ్యతిరేకించిన నేతలను జైళ్లల్లో తోసారు. అడగడానికి వీలు లేకుండా చేశారు. ఇదంతా కేవలం పదవిని కాపాడుకునే ప్రయత్నం తప్ప మరోటి కాదు. నిజంగానే ఇందిర తీసుకున్న ఈ నిరంకుశ నిర్ణయం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమించి జనతా పార్టీకి అంకురార్పణ చేశారు.ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి మహామహులంతా ఒక్కటిగా చేరి జనతా పార్టీగా అధికారం చేపట్టారు. మంచి నిర్ణయాలు తీసుకున్నారు. కానీ అది ఎంతో కాలం నిలవలేదు. ప్రధాని పదవికి పోటీపడిన వారంతా జనతాపార్టీని విచ్ఛిన్నం చేశారు.

ఇలా జనతా సమయంలోనూ, తరవాత ఎన్టీఆర్ హయాంలోనూ ఇలాగే జరిరగింది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్‌ను స్థాపించి,దానిని అధికారంలోకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నించినా, అదికూడా ఎక్కువ కాలం నిలవలేదు. మనదేశంలో ప్రజాస్వామ్యం వల్ల రాజకీయ నేతలు బాగుపడ్డారే తప్ప ప్రజలు బాగుపడలేదని 78 స్వాతంత్ర్యం వల్ల తెలిసింది. కొన్ని కుటుంబాలే బాగుపడుతున్నాయి. ప్రతి ఎన్నికల్లో నూ ప్రజలు ఓడిపోతున్నారు. రాజకీయ నాయకులు గెలుస్తున్నారు. నిరంకుశం పైకి కనపించకుండా అప్రకటిత ఎమర్జెన్సీ విధానాలు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా వారసత్వ రాజకీయాలదే పెత్తనంగా మారింది. మళ్లీమళ్లీ తామే గెలవాలన్న కుటిల వ్యూహంతో చేస్తున్న విన్యాసాలు, పథకాలు, ప్రయత్నాలు దేశాన్ని పురోగమించడానికి అడ్డుపడుతున్నాయి. భారతదేశం బ్రిటిష్ వలస పాలన సంకెళ్లను తెంచుకున్న తర్వాత, మన ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ రూపంలో తీవ్రమైన ముప్పు ఎదురైందన్నది ముమ్మాటికీ నిజం. అంతకు ముందు అంటే బ్రిటిషర్ల కన్నా ముందు కూడా మొఘలులు, ఖల్జీలు, నిజాంలు ఇలా ఎందరో దేశాన్ని పాలించి భారత దేశాన్ని దోచుకున్నారు. బ్రిటిషర్లు కూడా దోచుకున్నారు. వీరంతా నిరంకుశంగానే దోచుకున్నారు. ఆ తరవాత స్వాతంత్రం ఉద్యమం జరిగి, దేశం ముక్కలుగా విభజించబడిన తరవాత దోపిడీ కొత్త రూపంలో ప్రవేశించింది. ఆనాడు రాజులు రాజ్యమేలితే ఇప్పుడు కుటుంబాలు రాజ్యమేలుతున్నాయి. నెహ్రూ వారసత్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యమని కాంగ్రెస్ నేతలు నిత్యం స్మరిస్తూనే ఉంటారు. వందలాది ప్రతిపక్ష నేతలను, వేలమంది కార్యకర్తలను కారాగారాల్లో నిర్బంధించింది. పౌరహక్కులకు, ప్రాథమిక హక్కులకు ఎమర్జెన్సీ పాతరేసింది. భావప్రకటన స్వేచ్ఛను, వాక్ స్వాతంత్ర్యాన్ని హరించివేసింది. శాంతియుతంగా నిరసనలు తెలియజేయడానికి కూడా ఎక్కడా ఎవరూ గుమిగూడడానికి వీల్లేకుండా చేసింది. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేసింది. సెన్సార్‌షిప్ విధించింది. ఆఖరుకు న్యాయవ్యవస్థ స్వతంత్ర తకు కూడా కళెం వేయడానికి ప్రయత్నించింది. ఎమర్జెన్సీ ప్రకటించి ఇవన్నీ చేసిన ఇందిరనే మళ్లీ ప్రజలు ఎన్నుకున్నారు. ఆమె తనయుడినే మళ్లీ ప్రధానిగా ఎన్నుకున్నారు. ఇప్పుడు ఆయన తనయుడు రాహుల్ ప్రధాని కావాలంటూ కోసం శపథం తీసుకున్నారు. ప్రజలకు విద్య, వైద్యం అందించకుండా, కనీస వసతులు కల్పించకుండా చేస్తున్న పాలన కారణంగా ప్రజలు చైతన్యం కావడం లేదు. ఓటు బ్యాంక్ రాజకీయాల్లో ప్రజలు ఓడిపోతున్నారు. ప్రజాస్వామ్యం ముసుగులో నిరంకుశ నేతలు రాజ్యమేలు తున్నారు. యాభై సంవత్సరాల క్రితం మన ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులను కదిలించిన అత్యయిక స్థితి నేటి తరానికి చరిత్ర. దీనిగురించి తెలుసుకోవాల్సిందే. నేడు జరుగుతున్న పాలనా తీరును కూడా చర్చించాలి. నిజానికి ఆనాడు జనతా పార్టీ విజయం అత్యయిక స్థితికి ముగింపు పలికింది.

# టెన్త్ వార్షిక పరీక్షలు ఏడాదికి రెండుసార్లు



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు
రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

పదో తరగతి వార్షిక పరీక్షలను ఏడాదికి రెండుసార్లు నిర్వహించనున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఇ) తెలిపింది. 2026 నుండి ఇది అమల్లోకి రానుందని పరీక్షల కంట్రోలర్ సన్యం భరద్వాజ్ బుధవారం ప్రకటించారు. ఫిబ్రవరిలో నిర్వహించే తొలి విడత పరీక్షలను తప్పనిసరి చేయనున్నామని, మే నెలలో నిర్వహించే రెండో విడత పరీక్షలను ఆప్షనల్‌గా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి పరీక్షల ఫలితాలను ఏప్రిల్‌లో వెల్లడిస్తామని, మే పరీక్షల ఫలితాలను జూన్‌లో వెల్లడిస్తామని తెలిపారు. విద్యార్థులు తమ స్కోర్‌లను మెరుగుపరుచుకోవడానికి ఈ విధానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అంతర్గత మూల్యాంకనం (ఇంటర్నల్ అసెస్‌మెంట్) ఏడాదికి ఒక్కసారే ఉంటుందని అన్నారు. విద్యార్థులు సైన్స్, మేథమెటిక్స్, సోషల్ సైన్స్, లాంగ్వేజ్‌లలో మూడు సబ్జెక్టులను ఎంచుకుని బెటర్‌మెంట్ కోసం రాసుకోవచ్చని వెల్లడించారు. చలి ఎక్కువగా ఉండే (వింటర్ బౌండ్) స్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులకు ఏదో ఒక ఫేజ్‌లో పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది. సీబీఎస్ఇ ముసాయిదా నిబంధనలు ఫిబ్రవరిలో విడుదలయ్యాయి. తల్లిదండ్రులు, విద్యార్థుల అభిప్రాయాల కోసం పబ్లిక్ డొమైన్‌లో ఉంచింది. విద్యార్థుల్లో బోర్డు పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు, పరీక్షలకు అధిక విలువను తొలగించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు జాతీయ విద్యా విధానం (ఎన్ఇపీ) పేర్కొంది.

# మూడేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

## మంత్రి పియూష్ గోయల్ అంచనా



న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ

వచ్చే మూడేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ మరింత దూసుకుపోనుందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. 2027 నాటికి భారత్ 5 ట్రిలియన్ డాలర్ల (రూ.430 లక్షల కోట్లు) జిడిపి సాధించొచ్చని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం, వ్యాపార సంఘాలు, పరిశ్రమలు సహా 140 కోట్ల మంది భారతీయులు ముందుకు వెళ్తున్నారన్నారు. మర్చంట్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎంసిసిఐ) ఏర్పాటు చేసిన ఓ వర్చువల్ సెషన్‌లో మంత్రి పియూష్ గోయల్ మాట్లాడుతూ.. బలమైన స్థూల ఆర్థిక పునాదితో దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థ దృఢంగా ఉందన్నారు. దేశంలో ద్రవ్యోల్బణం అత్యల్పంగా మూడు శాతానికి తగ్గిందన్నారు. భారత్ 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థను అందుకోవడం కోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం, కార్మికులతో తయారీకి ప్రాధాన్యం, ప్రపంచ మార్కెట్‌పై దృష్టి సారించడం వంటి వాటిపై కీలక చర్యలను తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడగలిగేలా భారత్ తనను తాను మలుచుకుందన్నారు. రాబోయే దశాబ్ద కాలంలో దేశానికి డిజిటల్ మార్కెట్ కీలకమన్నారు. ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ఇటీవల నీతి ఆయోగ్ తెలిపింది. దేశ స్థూల దేశీయోత్పత్తి 4.19 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.356 లక్షల కోట్ల)కు చేరుకుంది. జపాన్ కంటే భారత జిడిపి 4.187 బిలియన్ డాలర్లు అధికంగా ఉందని పేర్కొంది. అమెరికా, చైనా, జర్మనీ తరవాత స్థానంలో భారత్ ఉందని వెల్లడించింది.

# యుపిలో ఇంటర్నేషనల్ పొటాటో సెంటర్

న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ

ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలోని సింగ్నాలో ఇంటర్నేషనల్ పొటాటో సెంటర్ (సిఐపి) దక్షిణాసియా ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం నాడిక్కడ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గం సమావేశం జరిగింది. ఈ క్యాబినెట్ భేటీ అనంతరం నేషనల్ మీడియా సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లో సిఐపికి కేంద్రం రూ. 111.5 కోట్లు కేటాయించిందని, ఆహారం, పోషకాహార భద్రత, రైతుల ఆదాయం, ఉపాధి కల్పనను పెంచడం దీని ప్రధాన ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగాళాదుంప ఉత్పత్తి చేస్తున్న దేశం భారత్ కాగా, దేశంలో ఉత్తరప్రదేశ్ ముందు వరుసలో ఉందని అన్నారు. పొటాటో సెంటర్ ఏర్పాటుతో బంగాళాదుంప ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, రవాణా, మార్కెటింగ్, విలువ గొలుసులో గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టించే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. అలాగే, యుపిలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. యుపిలోని గౌతమ్ బుద్ధనగర్‌లో రూ.417 కోట్లతో ఈఎంసి క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



అలాగే, పుణే మెట్రో రైలు ప్రాజెక్టు దశ-2ను మంత్రివర్గం ఆమోదించిందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లు 12.75 కిలో మీటర్ల విస్తరించి ఉంటాయని, 13 స్టేషన్లు ఉంటాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3,626.24 కోట్లని, ఈ వ్యయాన్ని కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వం సమానంగా భరిస్తాయని తెలిపారు. చాందినీ చౌక్, బవ్ధాన్, కోత్రుడ్, ఖరడి, వాఘోలి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాలను కలుపుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును నాలుగేళ్ల లోపు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

అదేవిధంగా జార?ండ్‌లోని ఝూరియా బగ్గు గనుల నిర్వాసితుల పునరావాసానికి (ఝరియా మాస్టర్ ప్లాన్) రూ. 5,940.47 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. నిర్వాసిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం కోసం నైపుణ్య శిక్షణ, స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

కాగా, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా కేంద్ర మంత్రి వర్గం తీర్మానాన్ని ఆమోదించినట్లు కూడా మంత్రి తెలిపారు. ఎమర్జెన్సీ బాధితులకు నివాళిగా మంత్రివర్గం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించినట్లు చెప్పారు. శుభాంశు శుక్లాతో కూడిన యాక్సియం-4 మిషన్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతించింది. దేశంలో విధించిన అత్యవసర పరిస్థితికి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన తీర్మానాన్ని చదివి వినిపించారు. 'అత్యవసర పరిస్థితిపై పోరాడిన లెక్కలేనన్ని మంది త్యాగాలను గుర్తుంచుకోవాలని నిర్ణయించింది. రాజ్యాంగాన్ని హత్య చేసే ప్రయత్నాన్ని విఫలం చేసిన ఈ ప్రజాస్వామ్యవాదులకు కేంద్ర మంత్రివర్గం నివాళులర్పించింది' అని పేర్కొన్నారు.

# 3 నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించండి





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

### -హైకోర్టు

**హైదరాబాద్: ప్రజా స్వేచ్ఛ...**
తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం బుధవారం కీలక తీర్పు వెలువరించింది. గ్రామపంచాయతీ ఎన్నికలు 3 నెలల్లో నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశిచింది.స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు గతేడాది జనవరి 31తో ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం నేడు తీర్పు వెలువరించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు "వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి" వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు కావాలని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక.. ప్రక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ..రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.


## ఘనంగా ఏ.ఐ.ఎస్.బి 75 వ వార్షికోత్సవం దినోత్సవం



**వరంగల్ జిల్లా, ప్రజా స్వేచ్ఛ...**
ఏ.ఐ.ఎస్.బి 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ వేణు రావు కాలనీ లోని ఏకశిల జూనియర్ కళాశాల వద్ద ఏ.ఐ.ఎస్.బి జండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ పాల్గొని జండా ఆవిష్కరించి ప్రసంగిస్తూ ఏ.ఐ.ఎస్.బి 1951 జూన్ 25 న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం లో ఏర్పడి సోషలిజం ,శాంతి, అభ్యుదయం అనే నినాదాలతో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధన కోసం గత 74 వ ఏళ్ల నుండి విద్యారంగ సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా అలుపెరుగని పోరాటాలు కొనసాగిస్తుందని ఆయన అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యారంగానికి కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ, ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్నాయి అని ఆయన ఆరోపించారు ప్రభుత్వ అసమర్థత విధానాల వల్ల పేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారిందని ఆరోపించారు , ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్య వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు పోరాటాలకు మరింత బలంగా నిర్వహించడానికి విద్యార్థులు ఏ.ఐ.ఎస్.బి లో చేరాలని అయినా పిలుపునిచ్చారు కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి జిల్లా కన్వీనర్ రోహిత్, జిల్లా నాయకులు పెండ్యాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పోరాట ఫలితమే రైతుబంధు

**సహకార సంఘం వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి.**



**మహేశ్వరం, ప్రజా స్వేచ్ఛ**
బీఆర్ఎస్ పార్టీ పోరాట ఫలితమే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును వేయడం జరిగిందని సహకార సంఘం వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక చొరవతోనే రంగారెడ్డి జిల్లాలో ఉన్న రైతులకు ఊరట లభించిందని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశంతో ఈనెల 18న జిల్లా కలెక్టర్ తో పాటు తాసిల్దార్ కు రైతుల పక్షాన మెమోరాండం అందజేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు వేయకుండా నాన్సుడు ధోరణి అవలంబిస్తే ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జిల్లా అధికారులతో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను కలిసి రైతుల గోస ను వివరించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాలేదని ఆయన తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశంతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# దివ్యాంగులకు పింఛన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలి

**-మందకృష్ణ మాదిగ**



**ఎల్బీనగర్,ప్రజా స్వేచ్ఛ...**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులందరికీ పింఛన్లు పెంచి స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఒక హోటల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు దివ్యాంగుల సంఘాల ప్రతినిధులతో మంగళవారం రోజు రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ దివ్యాంగులు అంటేనే పాలకులు, చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దివ్యాంగులకు ఇచ్చిన హామీలో భాగంగా పింఛన్ రూపాయలు 4,000 నుండి 6 వేల వరకు పెంచాలని అదేవిధంగా తమిళనాడు రాష్ట్రంలో అమలు చేస్తున్న మాదిరిగానే తెలంగాణ రాష్ట్రంలో కూడా వికలాంగులకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వికలాంగుల సంఘాల ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించి ఉద్యమం తీవ్రతరం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. పలు దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ దివ్యాంగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దివ్యాంగుల బందు ఏర్పాటు చేసి రూపాయలు 10 లక్షలు దివ్యాంగులకు అందజేయాలని, ఆరోగ్య భద్రత కార్డులు అందజేసి రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందే విధంగా చూడాలని, దివ్యాంగులైన తల్లిదండ్రుల పిల్లలకు కార్పొరేట్ ప్రైవేటు స్కూళ్లలో ఉచిత విద్య అందించాలని కూడా కోరారు. నామినేటెడ్ పదవుల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పిస్తూ సంక్షేమ పథకాల్లో భాగంగా ఎంత మంది దివ్యాంగులు ఉంటే అంత మందికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం పద్మశ్రీ మందకృష్ణ తీసుకుంటున్న ప్రతి నిర్ణయానికి దివ్యాంగుల సంఘాల నుండి పూర్తి మద్దతు ఉంటుందని వారు తెలిపారు.వి హెచ్ పి ఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ ఎల్ గోపాల్ రావు గారు కో చైర్మన్ అందే రాంబాబు గారు జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశం జాతీయ మహిళా అధ్యక్షురాలు భవాని చౌదరి రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం కాసిం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తిరుపతమ్మ వికలాంగుల సంఘాల ప్రతినిధులు నల్లగొండ శ్రీనివాస్ కొల్లి నాగేశ్వరరావు. చెరుకు నాగభూషణం మురిగాడి నరసింహ గుత్తికొండ కిరణ్, వంశరాజ్ రామచందర్, పద్మప్రియ, పూల నాగరాజు, గిద్దె రాజేష్ తుడుం రాజేందర్ మల్లికార్జున్ బండ జగన్ సుధాకర్ వెంకట్ రెడ్డి రవి మహమ్మద్ షఫీ కొత్త వెంకన్న, సైదులు కొమర మల్లు,పంది శ్రీను, వేణు తదితరులు పాల్గొన్నారు

## సింగరేణి లో జూలై 9 న దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చేయండి.

**-జేఏసీ సంఘాల నాయకుల పిలుపు**



**గోదావరిఖని ,ప్రజా స్వేచ్ఛ...**
కొత్త లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని, ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా మరియు సింగరేణి లో కొత్త గనులు కెటాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో సింగరేణి జేఏసీ సంఘాల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9 న సింగరేణి లో దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని వారు కార్మికుల కు పిలుపు నిచ్చారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి, ఐఎన్టీయుసి, సిఐటియు, టిబిజికేఎస్ మరియు ఐఎఫ్టీయు సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ధర్మపురి, తుమ్మల రాజారెడ్డి, మిర్యాల రాజిరెడ్డి, కే.విశ్వనాథ్ తో పాటు జేఏసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సకలజనుల సమ్మెకు మేము సై

**నాయబ్ తహశీల్దార్ కు సీఐటీయూ సమ్మె నోటీసు**

**వేంసూరు,ప్రజా స్వేచ్ఛ...**
జూలై 09 న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె కు మేము సై అని సీఐటీయూ వేంసూరు మండల కమిటి స్పష్టం చేసింది.బుధవారం ఖమ్మంజిల్లా వేంసూరు లోని ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సహాయ కార్యదర్శి తాళ్లూరి రామారావు అధ్యక్షతన జరిగిన సిఐటియు మండల కమిటి సమావేశంలో అనుబంధ కార్మిక సంఘాలు ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఆహ్వానితులుగా పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో పాలిస్తున్న మోడీ ప్రభుత్వం కార్మికవర్గాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే దానికి లేబర్ కోడ్లు తెచ్చి కార్మికులకు,ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తుందని దీంతో సంఘం పెట్టుకునే స్వేచ్ఛ,పోరాడే హక్కులు, కనీసవేతన చట్టాలు మరెన్నో కార్మిక సంక్షేమ చట్టాలు కనుమరుగౌతాయని తెలిపారు. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ కర్షకులకు ద్రోహం చేసే రైతాంగ చట్టాలు తెస్తుందని, ఉపాధి హామీ చట్టానికి అతి తక్కువ నిధులు కేటాయించి గ్రామీణ ప్రాంత వ్యవసాయ కార్మికులకు నష్టం చేస్తుందని తెలిపారు.వీటన్నిటికి వ్యతిరేకంగా జూలై 09 న సకలజనుల సమ్మె జరగనున్నదని అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, కర్షకులు, కూలీలు మండల కేంద్రంలో జరిగే ప్రదర్శనకు తరలి రావాలని పిలుపునిచ్చారు.



అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నాయబ్ తహశీల్దార్ వి. బంతి రామ్ కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో: తుంగా శేషయ్య,సాధు శరత్ బాబు, పూరేటి సూరిబాబు,సాధు రాంబాబు,నాగరాజు, బోయ ఏసు,

## ఖాజా నగర్ లో పాదయాత్ర లో స్థానిక సమస్యలకు తక్షణ పరిష్కరం చూపుతున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్.



**కూకట్పల్లి,ప్రజా స్వేచ్ఛ...**
ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఖాజా నగర్ కాలనీలో డ్రైనేజీ మరియు రోడ్ల సంబంధించిన సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి కాలనీలలో పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించడం జరిగింది. కాలనీలో పుడుకుపోయిన డ్రైనేజీ లైన్ ను జి.ఎచ్.ఎం.సి ఎయిర్ టెక్ యంత్రం సహాయంతో పూడికను క్లియర్ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో ప్రధానంగా ఉన్న డ్రైనేజ్ సమస్యను అతిత్వరలో పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కాలనీ లోని డ్రైనేజ్ లైన్స్ కు సంబంధించి అవసమైన బడ్జెట్ ను అంచనావేసి ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొన్ని చోట్ల పెండింగ్ ఉన్న సీసీ రోడ్లను కూడా నిర్మిస్తామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, పోశెట్టిగౌడ్, కైసర్, నవాజ్ ఖాన్, రజఖ్, ఇమామ్, సలీమ్, మహమూద్, ఖాసిమ్, మహమ్మద్ అలీ, గాఫర్, సమ్మద్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ మరియు శ్రీనివస్, సూపర్వైజర్ శివ, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## 5 వేల కోట్ల రైతు భరోసా నిధులు దుర్వినియోగం

**బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్..**

**బషీర్ బాగ్, ప్రజా స్వేచ్ఛ...**
రాష్ట్ర ప్రభుత్వం 5000 కోట్ల రైతు భరోసా నిధులను దుర్వినియోగం చేస్తుందని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు.రాష్ట్రంలో మొత్తం 70 లక్షల మంది రైతులు ఉన్నారన్నారు. ఒక కోటి 46 లక్షల ఎకరాల భూములను సాగు చేస్తున్నారన్నారు.ఎకరానికి 6000 చొప్పున మొత్తం తొమ్మిది వేల కోట్లు అవుతుంది.గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 100 ఎకరాల ఉన్న ధనికులకు రైతుబంధు పేరుతో సంవత్సరమునకు 5000 కోట్ల రూపాయలను దుర్వినియోగం చేశారన్నారు.నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వందల ఎకరాలు ఉన్న ధనిక భూస్వాములకు రైతు భరోసా ఇచ్చి ఐదు వేల కోట్లు రూపాయలను పేదల సొమ్మును ధనిక భూస్వాములకు ప్రభుత్వం అప్పచెప్పుతుందన్నారు.ఐదు ఎకరాల భూమి ఉన్న వారికే రైతు భరోసాను పరిమితం చేయాలన్నారు.మొత్తం 80 శాతం రైతులకు ఒక కోటి ఆరు లక్షల ఎకరాలకు 6400 కోట్లు రూపాయలు 63 లక్షల రైతులకు రైతు భరోసా నిధులు ఉపయోగపడతాయన్నారు.ధనిక రైతులకు రైతు భరోసా ఇవ్వడం వల్ల రాష్ట్ర ఖజానాపై సంవత్సరమునకు 5000 కోట్ల భారం అవుతుందన్నారు.ఈ ఐదు వేల కోట్లతో రాష్ట్రంలోని 100 నియోజకవర్గాలలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు చేసుకొని పేదలకు ఉచిత వైద్యం అందించవచ్చు అన్నారు.రెండో సంవత్సరంలో 5000 కోట్లు విద్య కోసం గురుకుల పాఠశాలలకు పర్మనెంట్ భవనాల ఏర్పాటుకు ఉపయోగపడుతుందన్నారు.ఈ దిశగా కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు రాహుల్ గాంధీ ఆలోచన చేయాలని కోరారు.

# బనకచర్లను అడ్డుకుంటాం

**-30న ప్రజాభవన్‌లో పీపీటీ**
**-బ్యారేజీల పునరుద్ధరణకు కన్సల్టెంట్‌గా ఎన్డీఎస్ఏ**
**-సత్వరమే సాగర్‌లో పూడికతీత**
**-ఆధునిక సాంకేతికతతో ఎస్ఎల్‌బీసీ పనులు**
**-నీటిపారుదల శాఖకు ఇద్దరు సైనికాధికారులు**
**-పదోన్నతులు, బదిలీలకు గ్రీన్ సిగ్నల్ : సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ...**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్లను చట్టపరంగా అడ్డుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూడడమే తమ ముందున్న కర్తవ్యమని తేల్చి చెప్పారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ ప్రాంత ప్రయోజనాలు ఏ విధంగా దెబ్బ తింటాయో బలమైన వాదనలు వినిపించి ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలువరిస్తామన్నారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ ఎర్రమంజిల్ కాలనీలోని నీటిపారుదల శాఖ కేంద్ర కార్యాలయంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్సీ మహమ్మద్ అంజద్ హుస్సేన్, డిప్యూటీ ఈఎన్సీ శ్రీనివాస్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నీటిపారుదల శాఖలోకి సైనికాధికారులు టన్నెల్ నిర్మాణాలలో అపారమైన అనుభవం కలిగిన ప్రముఖ సైనికాధికారులిద్దరిని నీటిపారుదల శాఖలోకి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఇటీవల రోహ్తాంగ్, జోజిలా టన్నెల్ నిర్మాణంలో పనిచేసిన ఇద్దరు అధికారులను వినియోగించుకునేందుకు నీటిపారుదల శాఖ కసరత్తు చేస్తున్నదన్నారు. భారత సైన్యంలో ఇంజినీర్ ఇన్-చీఫ్‌గా పనిచేసిన జనరల్ హార్పల్ సింగ్‌ను రాష్ట్ర నీటిపారుదల శాఖకు సలహా దారుడిగా నియమించనున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన టన్నెల్ టెక్నాలజీ నిపుణులు కర్నల్ పరిక్షిత్ మెహ్రా జులైలో రాష్ట్ర నీటిపారుదల శాఖలో చేరనున్నారని తెలిపారు. అలాగే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికపై సమీక్షించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పునరుద్ధరణ పనులకై ఎన్డీఎస్ఏ డిజైన్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తుందన్నారు. పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ప్రతివారం సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు తనకు నివేదికను సమర్పించాలన్నారు. కేంద్ర జలసంఘం సూచనలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలనీ, డిండి ప్రాజెక్ట్ భూసేకరణ విషయమై సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలని అన్నారు. ఆధునికంగా ఎస్ఎల్‌బీసీ పనులు శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్ఎల్‌బీసీ)పనుల పురోగతిపై సమీక్షించిన మంత్రి, పునరుద్ధరణ పనుల కోసం అంతర్జాతీయ స్థాయి ఏజెన్సీలతో చర్చించి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నామన్నారు. ఈమేరకు అధికారులకు ఆదేశాలు ఇచ్చామనీ, పనులను వేగవంతం చేసేందుకు ఖర్చుకు వెనకాడకుండా ముందుకు పోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అదే సమయంలో నీటిపారుదల శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేయాలనీ, అనంతరం బదిలీల తంతును వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రధాన ప్రాజెక్టులలో పూడికతీత పనులపై ఆయన స్పందిస్తూ అనేక జలాశయాలు పూడికతో నిండినందున 20 నుంచి 25 శాతం మేర నీటిసామర్థ్యం తగ్గిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాగార్జునసాగర్, నిజాంసాగర్ తదితర ప్రాజెక్టుల పూడిక తీత పనులపై ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా నాగార్జునసాగర్ పూడికతీత పనులను సత్వరం ప్రారంభించాలన్నారు. ఈవిషయమై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సమాచారం అందించాలని అధికారులను సూచించారు. దేవాదుల ప్రాజెక్టు మూడో దశ పనుల పురోగతితో పాటు సీతారామ ప్రాజెక్టుకు ప్రస్తుతం కేటాయించిన నిధుల పరిమితులకు లోబడి అదనపు ప్యాకేజీలను రూపొందించే అంశాలపై అధికారులు దష్టి సారించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.'సీఆర్ పాటిల్‌కు చెప్పాం'గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్‌తో తెలంగాణకు సంభవించనున్న ముప్పును సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఈ నెల 19న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సవివరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఇచ్చామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ-ఫిజిబిలిటీ నివేదికను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించవద్దని కోరామన్నారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ నీటి కేటాయింపులపై ప్రభావం పడుతుందనీ, దానిని దష్టిలో పెట్టుకుని నివేదికను తిరస్కరించాలని విజ్ఞప్తి చేసినట్టు వివరించారు. అందుకు స్పందించిన కేంద్ర మంత్రి పాటిల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన నివేదికను ఆమోదించలేదనీ, త్వరలోనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని మంత్రి వివరించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పుట్టుకొచ్చిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణ ప్రయోజనాలకు జరిగే నష్టంపై ఈ నెల 30న ప్రజాభవన్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు..

# పర్యాటక రంగం అభివృద్ధికి తెలంగాణలో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి





**మహబూబ్నగర్, ప్రజా స్వేచ్ఛ**
సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టును అద్భుతంగా తీర్చిదిద్దుతాం మంత్రి జూపల్లి కృష్ణారావు స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరుతో కలసి సోమశిల, అమరగిరి ద్వీపం, ఇతర పర్యాటక ప్రాంతాలను సందర్శించిన మంత్రి రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తూ ఈ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా మంత్రి జూపల్లి సోమశిల, అమరగిరి, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, నార్లాపూర్ రిజర్వాయర్, కొల్లాపూర్ లోని మాధవస్వామి ఆలయం, జెటప్రోలు మదనగోపాల స్వామి దేవాలయాన్ని సందర్శించారు. పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంత్రి జూపల్లి వెంట పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, కలెక్టర్ బదావత్ సంతోష్, ఇతర అధికారులు ఉన్నారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్/యూనియన్ టెరిటరిస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్టమెంట్(సాస్కి)' పథకం కింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్ కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పర్యాటక శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు సంబంధించిన ప్రతిపాదనలు, కార్యాచరణపై పర్యాటక శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు కేవలం టూరిజం ద్వారానే అభివృద్ధి చెందాయని, రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకువెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. త్వరలో టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యాటక రంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ముందుకు తీసుకెళ్తామని, ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని అన్నారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్/యూనియన్ టెరిటరిస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్టమెంట్(సాస్కి)' పథకం కింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్ కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, మల్లేశ్వరం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. క్లస్టర్ 1: ఈగలపెంట అరైవల్ జోన్, ఈగలపెంట విహార యాత్ర, ఈగలపెంట రివర్ క్రూయిజ్, చెంచు ట్రైబల్ ఎక్స్పిరియన్స్,క్లస్టర్ 2: సోమశిల వెల్నెస్ అండ్ స్పిరిచ్యువల్ రిట్రీట్ ఉంటాయని అన్నారు. సోమశిలలో బోటింగ్ జెట్టి, అమరగిరి ద్వీపంలో బోటింగ్ జెట్టి, కాటేజీలు, స్విమ్మింగ్ పూల్, కేఫ్టీరియా, స్పా, వెల్ నెస్ సెంటర్, ఇండోర్ అవుట్ డోర్ గేమ్స్, ఇతర సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థుల ఎంపిక





**పాపన్నపేట,ప్రజా స్వేచ్ఛ...**
ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పథకానికి శ్రీకారం చుట్టినదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు బుధవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో తెలంగాణా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ, ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబల్ స్కీం నందు ప్రైవేటు స్కూల్ ప్రవేశం కొరకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆయన పాల్గొన్నారు. లాటరీ ప్రక్రియ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 1వ, తరగతి నందు 59 మంది విద్యార్థిని విద్యార్థులు మరియు 5వ, తరగతి నందు 61 మంది విద్యార్థిని విద్యార్థులు నంది లక్కి డీప్ నందు ఎంపిక చేయడం జరిగిందన్నారు.ఎంపిక చేసిన విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## బిజినెస్

# స్టాక్ మార్కెట్లలో జోష్..

### సెన్సెక్స్ 700 పాయింట్లు జంప్..!



దేశీయ స్టాక్ మార్కెట్లు జోరుగా కొనసాగాయి. బెంచ్ మార్క్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు ఒకశాతం వరకు లాభపడ్డాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. దాంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడంతో చమురు ధరలు సైతం భారీగా పడిపోయాయి. సానుకూల సంకేతాల మధ్య రెండోరోజు మార్కెట్లు రాణించాయి. అన్నిరంగాల్లో భారీగా కొనుగోళ్లు జరుడంతో మార్కెట్లలో జోష్ కనిపించింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 30 షేర్ల బీఎస్ఇ సెన్సెక్స్ ఉదయం 82,448.80 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత వరుస కొనుగోళ్లతో సెన్సెక్స్ చివరి వరకు లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,339.57 పాయింట్ల కనిష్టానికి తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 82,815.91 పాయింట్ల గరిష్టానికి చేరుకుంది. చివరకు 700.40 పాయింట్ల లాభపడి 82,755.51 పాయింట్ల వద్ద ముగిసింది.ఎన్ఎస్ఈ నిఫ్టీ 200.40 పాయింట్లు పెరిగి 25,244.75 పాయింట్ల వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.6 శాతం పెరిగాయి. నిఫ్టీలో టైటాన్ కంపెనీ, ఇన్ఫోసిస్, ఎంఅండ్ఎం, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ అత్యధికంగా లాభాలను ఆర్జించాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐషర్ మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, ఓఎన్‌జీసీ నష్టపోయాయి. ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, టెలికాం, హెల్త్‌కేర్, మీడియా ఒకటి నుంచి రెండుశాతం వరకు పెరగడంతో అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి.

ట్రైమెక్స్ గ్రూప్ ఇండియా షేర్లు 5శాతం పతనమయ్యాయి. ఈఐడీ ప్యారీ, ఎంసీఎక్స్ ఇండియా, హ్యుందాయ్ మోటార్, మాక్స్ ఫైనాన్షియల్, హోమ్ ఫస్ట్ ఫైనాన్స్, నారాయణ హృదయాలయ, భారతి ఎయిర్‌టెల్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, మాక్స్ ఫైనాన్షియల్, ఎల్‌టీ ఫైనాన్స్, ఆదిత్య బిర్లా క్యాపిటల్, విశాల్ మెగా మార్ట్ వంటి వాటితో సహా బీఎస్ఈలో దాదాపు వంద స్టాక్స్ 52 వారాల గరిష్టాన్ని తాకాయి.

# మరోసారి లేఆఫ్స్‌కు సిద్ధమైన మైక్రోసాఫ్ట్.. !

ఆర్థిక అస్థిరత, పెరుగుతున్న కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వల్ల టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీలు వందల మంది ఉద్యోగులను ఇంటికి పంపుతున్నాయి. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 130కిపైగా కంపెనీలు దాదాపు 61 వేల మందికి పైగా ద్యోగులను తొలగించాయి. ఇక ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే.తాజాగా మరో రౌండ్ లేఆఫ్స్‌కు సంస్థ సిద్ధమవుతున్నట్లు తెలిసింది. 2025 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగుల కోతకు సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా వేలాది మందిపై వేటు వేయనున్నట్లు తెలిపింది. వచ్చే వారం ప్రారంభంలో లేఆఫ్స్ గురించి సంస్థ ప్రకటించే అవకాశం ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి.




వేలాది మందిపై ఈ ప్రభావం ఉండనున్నట్లు సమాచారం. తాజా లేఆఫ్స్‌లు విభాగంలో ఉండనున్నట్లు సమాచారం. గత 18 నెలల కాలంలో మైక్రోసాఫ్ట్ చేపట్టనున్న నాలుగో అతిపెద్ద ఉద్యోగాల కోత ఇదే కావొచ్చని టెక్ వర్గాలు భావిస్తున్నాయి. వరుస లేఆఫ్స్‌తో సంస్థలోని ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. కాగా, మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది మే నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరిలో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. ఈనెల ఆరంభంలో కూడా పలువురిపై సంస్థ వేటు వేసింది. డైనమిక్ మార్కెట్‌లో పోటీదారుగా నిలవడానికి, కంపెనీ పునర్ నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడానికి కోతలు తప్పడం లేదని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తూన్నాం' అని మైక్రోసాఫ్ట్ తెలిపింది.

# దేశంలో 30కోట్ల 5జీ కస్టమర్లు

న్యూఢిల్లీ,

గత ఏడాది చివరి నాటికి దేశంలో 5జీ వినియోగదారులు 29 కోట్లకు చేరారని మంగళవారం విడుదలైన ఎరిక్సన్ మొబిలిటీ రిపోర్టులో తేలింది. మొత్తం భారతీయ మొబైల్ వినియోగదారుల్లో ఇది 24 శాతమని పేర్కొన్నది. అలాగే ఒక్కో స్మార్ట్‌ఫోన్ యూజర్ నెలకు 32 జీబీ డాటాను వాడుకున్నారని ఈ తాజా నివేదికలో ఎరిక్సన్ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే 2030కల్లా ఇంచుమించుగా మూడురెట్లు పెరిగి దేశీయ 5జీ సబ్‌స్క్రైబర్లు దాదాపు 98 కోట్లకు చేరుకోవచ్చని (దేశీయ మొబైల్ వాడకందారుల్లో 75 శాతం), నెలకు స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల డాటా వాడకం 62 జీబీని తాకవచ్చని అంచనా వేసింది.ఇక




2030 నాటికి దేశంలో 4జీ కస్టమర్లు ప్రస్తుతంతో పోల్చితే సుమారు 60 శాతం పడిపోయి 23 కోట్లకు పరిమితం కావచ్చంటూ ఈ అప్‌డేటెడ్ రిపోర్టులో స్వీడిష్ టెలికం కంపెనీ చెప్పింది. నిరుడు నవంబర్‌లో విడుదల చేసిన రిపోర్టులో 2030 నాటికి దేశంలో 5జీ యూజర్లు 97 కోట్లకు పెరగవచ్చని, 4జీ కస్టమర్లు 24 కోట్లుగా ఉంటారని అంచనా వేసింది. నెలవారీ డాటా వినియోగం కూడా స్మార్ట్‌ఫోన్‌కు 66 జీబీగా ఉండొచ్చన్నది. అయితే తాజా నివేదికలో ఈ నెంబర్లను సవరించింది.

# టెస్ట్ ర్యాంకింగ్స్‌ను ప్రకటించిన ఐసీసీ..!

### కెరియర్‌లో అత్యుత్తమ ప్లేస్‌కి రిషబ్ పంత్..!

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. ఇంగ్లండ్‌తో తొలి టెస్టుల్లో బ్యాక్‌టుబ్యాక్ సెంచరీలతో చెలరేగిన భారత స్టార్ వికెట్ కీపర్ ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా ఏడో ప్లేస్‌కు చేరుకున్నాడు. లీడ్స్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో రెండు సెంచరీలు సాధించాడు. కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ సైతం టాప్-20లోకి ప్రవేశించాడు. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో టీమ్ ఇండియా ఐదు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఇంగ్లండ్ 82 ఓవర్లలోనే 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించగా.. ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. లీడ్స్ టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో రెండు సెంచరీలు చేసిన రెండో వికెట్ కీపర్‌గా పంత్ నిలిచాడు. అంతకుముందు జింబాబ్వేకు చెందిన ఆండీ ఫ్లవర్ ఒకే టెస్ట్ మ్యాచ్‌లో రెండు సెంచరీలు చేసిన ఏకైక వికెట్ కీపర్.లీడ్స్ టెస్ట్‌లో పంత్ తొలి ఇన్నింగ్స్‌లో 134, సెకండ్ ఇన్నింగ్స్‌లో 118 పరుగులు చేశాడు. అదే సమయంలో శుభ్‌మాన్ గిల్ ఐదు స్థానాలు ఎగబాకి టాప్ 20కి చేరుకున్నాడు. లీడ్స్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో గిల్ సెంచరీ చేశాడు. టాప్ 20 టెస్ట్ బ్యాట్స్‌మెన్ జాబితాలో భారతదేశం నుంచి ముగ్గురు బ్యాట్స్‌మెన్




మాత్రమే ఉన్నారు. పంత్, గిల్‌తో పాటు యశస్వి జైస్వాల్ నాలుగోస్థానంలో ఉన్నాడు. లీడ్స్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి సైతం సెంచరీ చేశాడు. టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పులు జరుగలేదు. హెడింగ్లీ టెస్ట్‌లో 14వసారి ఐదు వికెట్లు తీసిన తర్వాత భారత ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 62 పరుగులు, సెకండ్ ఇన్నింగ్స్‌లో 149 పరుగులు చేసి ఇంగ్లండ్ విజయంలో కీలకపాత్ర పోషించిన బెన్ డకెట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఈక్రమంలో టెస్ట్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ ఓలీ పోప్ మూడు స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి, జామీ స్మిత్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 27వ స్థానానికి చేరుకున్నారు. ఇంగ్లండ్ సీనియర్ ప్లేయర్ జో రూట్ నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. హ్యారీ బ్రూక్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ మూడోస్థానంలో ఉన్నాడు. లీడ్స్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బాల్, బ్యాట్‌తోనూ రాణించగా.. ఆల్‌రౌండర్ల జాబితాలో మూడుస్థానాలు మెరుగుపరుచుకొని ఐదోప్లేస్‌కు చేరాడు. టెస్ట్ ఆల్ రౌండర్ల జాబితాలో టీమిండియా ప్లేయర్ రవీంద్ర జడేజా అగ్రస్థానంలో ఉన్నాడు. శ్రీలంక-బంగ్లాదేశ్‌తో మధ్య తొలి టెస్ట్ డ్రాగా ముగియగా.. ఈ మ్యాచ్‌లో రాణించిన పలువురు ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌నూలో మార్పులు జరిగాయి. గాలెలో టెస్టులో 163 పరుగులు చేసిన బంగ్లా ప్లేయర్ ముష్ఫికర్ రహీమ్ 11 స్థానాలు ఎగబాకి 28వ స్థానానికి చేరుకోగా.. నజ్ముల్ హొస్సేన్ శాంటో ఒకే మ్యాచ్‌లో రెండు సెంచరీలు చేసి 21 స్థానాలు ఎగబాకి 29వ స్థానానికి చేరుకున్నాడు.

## స్పోర్ట్స్

# బుమ్రా అంశంలో ప్లాన్ మార్చేది లేదు

### -గౌతం గంభీర్




లీడ్స్

ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఇండియా ఓడిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో ప్రధాన బౌలర్ బుమ్రా ఒక్క వికెట్ కూడా తీయలేదు. ఇంగ్లండ్‌తో ఆడే అయిదు టెస్టుల సిరీస్‌లో కేవలం మొదటి మూడు టెస్టులకు మాత్రమే బుమ్రాను ఎంపిక చేశారు. ప్రస్తుతం తొలి టెస్టు ఓడిన నేపథ్యంలో.. ఆ ప్లాన్‌ను ఎటువంటి మార్పు చేసేది లేదని ప్రధాన కోచ్ గౌతం గంభీర్ తెలిపారు. వాస్తవానికి హెడ్డింగ్‌లీ పిచ్‌పై బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. కానీ ఇంగ్లీష్ బ్యాటర్ల వికెట్లను తీయడంలో భారత్ విఫలమైంది. రెండో ఇన్నింగ్స్‌లో 371 రన్స్ టార్గెట్‌ను ఇంగ్లండ్ చాలా సులువుగా ఛేజ్ చేసింది.వర్క్ లోడ్ మేనేజ్మెంట్ వల్ల బుమ్రాపై అధిక వత్తిడి పెంచలేమని గంభీర్ తెలిపాడు. తొలి మూడు టెస్టులకే అతన్ని ఎంపిక చేసినా.. మొదటి టెస్టు ఓటమితో.. ఇంకా నాలుగు మ్యాచ్‌లే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అతని అంశంలో నిర్ణయాన్ని మార్చుకునే అవకాశం లేదని గంభీర్ తెలిపారు. తమ ప్రణాళికల్లో ఎటువంటి మార్పు లేదని, అతనిపై వర్క్‌లోడ్ ఉందని, ఈ సిరీస్‌కు రాకముందే ఆ అంశంపై క్లారిటీ ఉందన్నారు. బర్మింగ్‌హామ్‌లో జూలై రెండో తేదీ నుంచి రెండో టెస్టు ప్రారంభంకానున్నది. అయితే ఏ రెండు టెస్టుల్లో బుమ్రా ఆడుతాడో ఇంకా స్పష్టంగా తెలియదు. తమ వద్ద అద్భుతమైన బౌలింగ్ బృందం ఉందని, దాంట్లో తనకు నమ్మకం ఉందని, నమ్మకంతోనే జట్టును ఎంపిక చేస్తామని, ఆశతో కాదన్నారు. లీడ్స్ టెస్టులో అయిదో రోజు ఓ దశలో గెలిచే స్థితిలో ఉన్నామని, మన బౌలర్లు రాణిస్తారని గంభీర్ పేర్కొన్నారు.

# హార్దిక్ పాండ్యాతో రిలేషన్‌పై పెదవి విప్పిన ఈశా గుప్తా..!

క్రికెటర్ హార్దిక్ పాండ్యాతో రిలేషన్‌పై బాలీవుడ్ నటి ఈషా గుప్తా క్లారిటీ ఇచ్చింది. ఇద్దరూ ప్రేమలో ఉన్నట్లుగా వార్తలు వచ్చాయి. తాజాగా సిద్ధార్థ్ కన్నన్ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈషా గుప్తా తన వ్యక్తిగత జీవితంపై మాట్లాడుతూ స్పష్టతనిచ్చింది. కొంతకాలం ఇద్దరం మాట్లాడుకున్నామని.. కానీ, డేటింగ్ చేస్తున్నట్లు అనుకోలేదని చెప్పింది. కొద్దినెలల పాటు మధ్య మాటలు సాగాయని.. బహుశా ఇది జరుగుతుందేమో, జరగదేమో అన్న దశలో ఉండేవాళ్లమని.. మేం డేటింగ్ దశకు చేరుకోకముందే అది ముగిసిపోయిందని చెప్పారు. దాన్ని డేటింగ్ చెప్పలేమని.. ఒకట్రెండు సార్లు కలిశామని.. ముందే చెప్పినట్లుగా.. కొన్ని నెలల పాటు మాట్లాడుకున్నామని.. ఆ తర్వాత అది



ఆగిపోయిందని వివరించారు.నిజంగానే వారిద్దరి మధ్య సంబంధం ఏర్పడే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు ఈశా స్పందిస్తూ.. బహుశా జరిగి ఉండేదేమోనని.. అనుకున్నంత వేగంగా విషయాలు ముందుకు సాగలేదని చెప్పారు. సమయం, సందర్భం సరిగ్గా కుదరలేదని ఆమె పంచుకున్నారు. ఇద్దరి మధ్యలు ఎలాంటి గొడవలు జరుగలేదని.. మనస్పర్థలు సైతం రాలేదని.. అలా జరగాలని రాసిపెట్టలేదంటే అంటూ వ్యాఖ్యానించారు. అయితే, కాఫీ విత్ కరణ్ హార్దిక్ పాండ్యా సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కాఫీ విత్ కరణ్' లో షోలో హార్దిక్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఎలాంటి ప్రభావం చూపించలేదని కూడా స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. ఈషా గుప్తా కెరీర్ విషయానికొస్తే.. ఈశా బాబీ డియోల్‌తో ఎంఎక్స్ ప్లేయర్ వెబ్ సిరీలో నటించింది. ఏక్ బద్నామ్ ఆశ్రమ్-3 పార్ట్ 2లో కనిపించింది. వన్ డే: జస్టిస్ డెలివర్డ్ మూవీలో డీసీపీ లక్ష్మిరాఠి పాత్రలో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'హేరా ఫేరీ 3' మూవీలో నటిస్తున్నట్లు సమాచారం.

# హిట్ కోసం రూట్ మార్చిన కాజల్

పెళ్లి ప్రెగ్నెన్సీ కారణంగా సిల్వర్ స్క్రీన్ చందమామకు కెరీర్‌లో కాస్త గ్యాప్ వచ్చింది. కానీ అప్పటికే కాజల్ ఫామ్ తగ్గటంతో రీ ఎంట్రీలో పెద్దగా అవకాశాలు రాలేదు. ముఖ్యంగా కమర్షియల్ హీరోయిన్ రోల్స్‌లో అసలే కనిపించలేదు ఈ బ్యూటీ.గత ఆరేళ్లలో ఈ బ్యూటీ కెరీర్‌లో ఒక్క హిట్ కూడా లేదు. భగవంత కేసరి హిట్ అయినా.. ఆ సినిమాలో అసలు కాజల్ క్యారెక్టర్ ఎందుకు ఉందో ఎవరిక అర్థం కాలేదు. ఈ టైమ్‌లో డిజిటల్ ప్రాజెక్ట్స్‌కు ఓకే చెప్పారు కాజల్.కానీ అవి కూడా అమ్మడి కెరీర్‌ను గాడిలో పెట్టలేకపోయాయి. దీంతో సెకండ్ ఇన్నింగ్స్‌లో బిగ్ బ్రేక్ కోసం వెయిట్ చేస్తున్నారు కాజల్ అగర్వాల్. ఈ టైమ్‌లో కాజల్ షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోస్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.ఈ ఇయర్ బర్త్ డేను ఫ్యామిలీతో కలిసి మాల్‌దీవ్స్‌లో సెలబ్రేట్ చేసుకున్నారు కాజల్ అగర్వాల్. ఈ ట్రిప్‌కు సంబంధించిన ఫోటోలు తన సోషల్ మీడియా పేజ్‌లో షేర్ చేసిన చందమామ... నెటిజెన్స్‌కు షాక్ ఇచ్చారు. పెళ్లి తరువాత పెద్దగా గ్లామర్ యాంగిల్ చూపించని ఈ బ్యూటీ...,. సడన్‌గా బికినీలో దర్శనమిచ్చారు.బీచ్‌లో చెల్లెలు నిషా అగర్వాల్‌తో కలిసి సింగిల్ పీస్ బికినీలో ఇచ్చిన ఫోజులు ఇప్పుడు సోషల్ మీడియాలో హీట్ పెంచుతున్నారు. సడన్ ఈ రేంజ్ గ్లామర్ చేయటం వెనుక రీజనేంటన్న డిస్కషన్ జరుగుతోంది. స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాల కోసమే కాజల్ ఇంత గ్లామరస్‌గా మారారంటున్నారు నెటిజెన్స్. మరి అమ్మడి కష్టానికి ఎంత వరకు ఫలితం దక్కుతుందో చూడాలి.






# రూ.100 కోట్ల క్లబ్‌లో శేఖర్ కమ్ముల 'కుబేర'

విలక్షణ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన కుబేర చిత్రం బాక్సాఫీస్ వద్ద పరుగులు పెడుతుంది. ఇప్పటికే రూ.80 కోట్లు వసూళ్లు రాబట్టిన ఈ చిత్రం తాజాగా రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరింది. స్టార్ హీరో ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించగా.. ఏషియన్ అధినేత సునీల్ నారంగ్ ఈ సినిమాను నిర్మించాడు. విడుదలైన మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.80 కోట్ల మార్క్ దాటిన ఈ చిత్రం 5 రోజుల్లో రూ.100 కోట్ల మార్క్‌ను అందుకుంది. ఈ సందర్భంగా చిత్రబృందం కొత్త పోస్టర్‌ను పంచుకుంది.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సముద్ర గర్భంలో నిక్షిప్తమై ఉన్న లక్షల కోట్ల ఖరీదు చేసే ఆయిల్ నిక్షేపాలపై ప్రముఖ పారిశ్రామికవేత్త నీరజ్(జిమ్ సర్ఫ్) కన్ను పడుతుంది. ప్రభుత్వాన్ని కొని అయినా సరే.. ఆ అయిల్ నిక్షేపాన్ని సొంతం చేసుకోవాలని ప్రయాత్నాలు మొదలుపెడతాడు నీరజ్. ప్రభుత్వ పెద్దలను లక్ష కోట్లు ఎర వేయడంతో.. వాళ్లు నీరజ్‌కు సముద్రాన్ని రాసిస్తారు. ఆ లక్షకోట్ల నల్ల ధనం ప్రభుత్వ పెద్దలకు చేరాలంటే ముందు అది వైట్ మనీగా మారాలి. అలా మార్చగల ఒకేఒక్క వ్యక్తి సీబీఐ ఆఫీసర్ దీపక్(అక్కినేని నాగార్జున). కొందరి కుట్రల వల్ల అన్యాయంగా జైలు శిక్ష అనుభవిస్తున్న దీపక్‌ను ఈ విషయంలో సాయం కోరతాడు నీరజ్. జైలు నుంచి విడిపించడమే కాక, కావాల్సినంత డబ్బు కూడా ఇస్తామనడంతో.. స్వతహాగా నిజాయితీ పరుడైన దీపక్.. కుటుంబం కోసం నీరజ్‌తో తప్పక చేయి కలుపుతాడు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో నాలుగు బినామీ ఖాతాలలో లక్ష కోట్లు బదిలీ చేయాలని ప్లాన్ చేస్తారు. దాని కోసం నలుగురు బెగ్గర్లను సెలక్ట్ చేస్తారు. వారిలో దేవ(ధనుష్) ఒకడు. మరి దీపక్ ప్లాన్ వర్కవుట్ అయిందా? అసలు ఈ కథలో దేవా పాత్ర ఏంటి? దేవాకూ, దీపక్‌కూ మధ్య సంబంధం ఏంటి? పారిశ్రామిక వేత్త నీరజ్ ప్రయత్నం సఫలమైందా? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.



# అఖిల్ సినిమా నుంచి తప్పుకున్న శ్రీలీల.!

టాలీవుడ్ యువ హీరో అక్కినేని వారసుడు అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. ఈ సినిమాకు మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తుండగా, అఖిల్ సొంత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే నుంచి టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయగా.. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ గ్లింప్స్ ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ సినిమాలో కథనాయికగా నటిస్తున్న శ్రీలీల మువీ నుంచి తప్పుకుందని తెలుస్తుంది.మొదట ఈ సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల ఖరారైనట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే, ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న ఇతర ప్రాజెక్టులు, ముఖ్యంగా హిందీ, తమిళ సినిమాల కోసం డేట్స్ కేటాయించడం కష్టంగా మారిన కారణంగా ఈ ప్రాజెక్ట్ నుంచి శ్రీలీల తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు ఈ వార్తలు నిజమైతే, శ్రీలీల స్థానంలో మరో హీరోయిన్‌ను వెతికే పనిలో చిత్రబృందం ఉందని తెలుస్తోంది. శ్రీలీల ప్రస్తుతం తెలుగులో పవన్ కల్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో పాటు బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్‌తో ఒక చిత్రంలో తమిళంలో సుధ కొంగరా చిత్రంలో నటిస్తుంది.

# టాలీవుడ్ లో కనిపించని బేబమ్మ..

## తెలుగు సినిమాలకు దూరమవుతుందా ?

ఉప్పెన సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే ఇండస్ట్రీలో సంచలనం సృష్టించింది ఈ వయ్యారి. బ్యాక్ టూ బ్యాక్ హిట్ సినిమాలతో ఆకట్టుకుంది. ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో హ్యాట్రిక్ హిట్స్ ఖాతాలో వేసుకుంది ఈ వయ్యారి. తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకుంది.అయితే వరుసగా మూడు హిట్స్ ఖాతాలో వేసుకున్న ఈ వయ్యారి.. ఆ తర్వాత ఆమె కెరీర్ ఊహించని విధంగా మారిపోయింది. వరుసగా హ్యాట్రిక్స్ హిట్స్ అందుకున్న మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, మనమే వంటి సినిమాలు వరుస ప్లాపులు పడ్డాయి. దీంతో తెలుగులో అవకాశాలు తగ్గిపోయాయి.ప్రస్తుతం జస్ట్ ఫర్ ఛేంజ్ చిత్రంతో మలయాళంలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాతో అక్కడ బేబమ్మకు మంచి క్రేజ్ వచ్చేసింది. ఇక ఇప్పుడు తమిళంలోనూ అవకాశాలు అందుకుంటుంది. కార్తీ సరసన వా వాతియార్ సినిమాలో నటిస్తుంది. ఇప్పటికే ఈ మూవీ విడుదల కావాల్సి ఉండగా అనుహ్యంగా వాయిదా పడింది.అలాగే తమిళంలో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ చిత్రంలో నటిస్తుంది. ఈ మూవీ సెప్టెంబర్ 18న అడియన్స్ ముందుకు రానుంది. వీటితోపాటు జీని అనే తమిళంలో చిత్రంలో నటిస్తుంది. ఇవే కాకుండా బేబమ్మకు తమిళంతోపాటు మలయాళంలోనూ మరిన్ని ఆఫర్స్ వస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా మరో క్రేజ్ ఛాన్స్ కొట్టేసింది.పృథ్వీరాజ్ సుకుమార్ రూపొందిస్తున్న ఖలీఫా చిత్రంలో ఈ అమ్మడు కనిపించే ఛాన్స్ ఉన్నట్లు టాక్. 2022లోనే ఈ మూవీ ప్రకటన వచ్చినప్పటికీ .. పృథ్వీరాజ్ వరుస సినిమాలతో బిజీగా ఉండడంతో సినిమా ఆలస్యమయ్యింది. ఇక ఇప్పుడు జూలై నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు తెలుస్తోంది.



Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492